

విశాఖలో వచ్చే నెల 8 నుంచి ఏపీఎల్

- 14న క్రీడాకారుల కోసం వేలం
- ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ రావు వెంకట సుజయ్‌కృష్ణ రంగారావు



- వివరాలు మెయిన్‌లో

సర్కారు భూమికి స్కెచ్

చింతగట్ల సర్వే నంబరు 81.2లో 47.714 ఎకరాలు కొండ పోరంబోకు భూమి

- అందులో 40 ఎకరాలు పేదల ఇళ్ల కోసం సమీకరణ
- మిగిలిన 7 ఎకరాల్లో 5 ఎకరాలు కొట్టేసేందుకు ప్లాన్
- డి.పట్టా పేరిట నాటకం
- తెర వెనుక కూటమి నేత బంధువు
- రెవెన్యూ అధికారులపై ఒత్తిడి



చింతగట్ల గ్రామం సర్వే నంబరు 81-2లోని ప్రభుత్వ భూమి


విశాఖపట్నం/పెందుర్తి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): **పెందుర్తి మండలం చింతగట్లలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కొట్టేయడానికి కూటమి నేతల ప్రోత్సాహంతో ఒకరు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అది ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఉన్న విషయం రెవెన్యూ అధికారులు చెప్పినా వినకుండా బెదిరించి సర్వే చేయించారు. దాని ఆధారంగా కోర్టును ఆశ్రయించి భూమిని చేజిక్కించుకోవాలని చూస్తున్నారు.**

చింతగట్ల గ్రామ సర్వే నంబరు 81.2లో 47.714 ఎకరాలు కొండ పోరంబోకు ఉంది. ఇటీవల భూముల రీసర్వే నిర్వహించినప్పుడు కూడా సర్వేనంబరు 81-2లో గల 47.714 ఎకరాలను ప్రభుత్వ భూమిగానే నిర్ధారించారు. అందులో 40 ఎకరాలను వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల కోసం సమీకరించారు. ప్రస్తుతం 7.714 ఎకరాలు మిగిలి ఉంది. దానిపై కొందరు కూటమి నేతల కన్నుపడింది. ఎలాగైనా భూమి కొట్టేయడానికి ప్లాన్ వేశారు. ఇదిలావుండగా తనకు 1970 ప్రాంతంలో ప్రభుత్వం కొండవాలులో భూమి ఇచ్చిందంటూ (డీపట్టా) ఒకరు కొద్దికాలం కిందట రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేశారు. సదరు దరఖాస్తుదారుడితో కూటమి నేతలు ఒప్పందం చేసుకుని సర్వే నంబరు 81-2లోనే తన ఐదు ఎకరాలు ఉందని, సర్వే చేసి తన భూమి తనకు అప్పగించాలని మరోమారు దరఖాస్తు చేయించారు. దీని ఆధారంగా సచివాలయ సర్వేయర్ కొండ వాలు ప్రాంతంలో సర్వే చేసి రిపోర్టు ఇచ్చారు. అందులో ఎటువంటి యాజమాన్య వివరాలను నిర్ధారించలేదు. అదంతా ప్రభుత్వ భూమిగానే పేర్కొన్నారు. అయినప్పటికీ 81-2లో ఐదు ఎకరాలను తన పేరిట నమోదు చేయాలని సదరు దరఖాస్తుదారుడు చింతగట్ల వీఆర్వోను కోరగా, అందుకు ఆయన తిరస్కరించారు. సర్వే నంబరు 81-2లో గల 7.714 ఎకరాలు ప్రభుత్వ భూమిగా పేర్కొన్నారు. దీంతో వెనుక ఉండి కథ నడిపిస్తున్న కూటమి నేతలు... సదరు దరఖాస్తుదారుడితో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయించారు. కూటమి పార్టీలో కీలక నేత బంధువునని చెప్పుకుంటున్న ఒకరు ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ భూమి విలువ సుమారు రూ.25 కోట్లు ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. సర్వేనంబరు 81-2లో భూమి ప్రభుత్వానికి చెందినదేనని చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2024 జనవరిలో వైసీపీ నాయకులు దగ్గరుండి గ్రామానికి చెందిన కొందరికి ఇళ్ల స్థలాల కోసం కొండవాలు చూపించారు. దీంతో భూమిలోకి వెళ్లి చదునుచేస్తుండగా ... మిగతా 6వ పేజీలో

స్వచ్ఛ విశాఖ

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీకి జాతీయ స్థాయి మినిస్టీరియల్ అవార్డు

- 19న ఢిల్లీలో అధికారికంగా ప్రకటన



విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)కు జాతీయ స్థాయిలో ప్రత్యేక కేటగిరీలో మినిస్టీరియల్ అవార్డు లభించింది. ఢిల్లీలో ఈనెల 19న స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల పంపిణీ కార్యక్రమం జరగనున్నది. ఆదేరోజు ఫలితాలను అధికారికంగా వెల్లడించనున్నారు. కాగా ఢిల్లీలో 19న జరిగే అవార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరుకావాలంటూ జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, మేయర్ పీలా శ్రీనివాసరావులకు కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ అధికారుల నుంచి ఆహ్వానం అందింది.

కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలను నిర్వహిస్తోంది. అయితే ఏటా మాదిరిగా కాకుండా ఈ ఏడాది భిన్నంగా నిర్వహించింది. జాతీయ స్థాయిలో ఏటా మూడు నగరాలే మొదటి మూడు స్థానాలను దక్కించుకుంటుండడంతో వాటిని ఈ ఏడాది పోటీ నుంచి మినహాయించారు. దీంతో పది లక్షలకు పైబడిన జనాభా కేటగిరీ నగరాల్లో విశాఖకు ఒకటి లేదా రెండో ర్యాంకు దక్కుతుందని అధికారులు ఆశిస్తున్నారు. అయితే స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్ శనివారం నగర పర్యటనకు వచ్చినపుడు జీవీఎంసీకి ప్రత్యేక కేటగిరీలో మినిస్టీరియల్ అవార్డు లభించిందని ప్రకటించారు. రాష్ట్రస్థాయిలో మినిస్టీరియల్ అవార్డు రాజమండ్రికి, పది లక్షల జనాభా పైబడిన కేటగిరీలో విజయవాడ, మూడు లక్షలు పైబడిన జనాభా కేటగిరీలో గుంటూరు, మూడు లక్షలలోపు జనాభా గల నగరాల కేటగిరీలో తిరుపతి సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డులు గెలుచుకున్నాయన్నారు. ఏ నగరానికి ఏ ర్యాంకు లభించింది?, కేటగిరీ వారీగా ఎన్నిమార్కులు వచ్చాయనే వివరాలను వెల్లడించలేదు. 19న పూర్తివివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.



కొంగొత్తగా కైలాసగిరి

మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని వీఎంఆర్‌డీఏ ప్రణాళిక

- రాత్రి బస చేసేందుకు ఎకో కాటేజీలు
- పార్టీలకు రివాల్వింగ్ రెస్టారెంట్... బే వ్యూ కాఫీ షాప్
- సింగపూర్‌లో మాదిరిగా లూజ్ గ్రావిటీ రైడింగ్స్
- మరింత పొడవుగా రోప్‌వే



కైలాసగిరిపై రివాల్వింగ్ రెస్టారెంట్ నమూనా

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన కైలాసగిరిపై మరిన్ని ఆకర్షణీయమైన ప్రాజెక్టులు ఏర్పాటు చేయడానికి విశాఖ మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ ప్రణాళికలు రూపొందించింది. ఆసక్తి కలిగిన సంస్థల నుంచి వాటి నిర్మాణం, నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అందులో ఎకో హైట్ కాటేజీలు, 360 డిగ్రీల కోణంలో తిరిగే రివాల్వింగ్ రెస్టారెంట్, కాఫీ షాపు, లూజ్ గ్రావిటీ రైడింగ్స్, కొత్త రోప్ వే ఉన్నాయి.

కైలాసగిరిపై సువిశాలమైన భూమి ఉన్నందున దానిని ఉపయోగించుకొని మరింత మంది పర్యాటకులను ఆకర్షించడానికి పలు ప్రాజెక్టులు రూపొందించారు. ప్రస్తుతం కొండపైకి ఎవరైనా వెళ్లి కాసేపు సేదతీరి, వచ్చేయడమే జరుగుతోంది. అలా కాకుండా పర్యాటకులు రాత్రికి అక్కడే బస చేసేలా 'ఎకో హైట్ కాటేజీలు' నిర్మించనున్నారు. వాటిలో బస మరచిపోలేని అనుభూతిని ఇస్తుందని, సుమారు ఐదు నుంచి పది కాటేజీలు నిర్మించాలని యోచిస్తున్నారు.

కైలాసగిరి పైకి వెళ్లేవారు ఏమైనా తినాలంటే చిన్న చిన్న హోటళ్లు తప్పితే మంచి హోటల్ ఒక్కటి కూడా లేదు. ఆ లోటు తీరేలా 360 డిగ్రీల కోణంలో తిరిగే రివాల్వింగ్ రెస్టారెంట్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రతిపాదన చాలాకాలంగా ఉన్నా.. ఇప్పుడు దీనిని కార్యరూపంలోకి తేవాలని కృతనిశ్చయంతో పనిచేస్తున్నారు. అలాగే పర్యాటకులు సముద్రాన్ని చూస్తూ కొంతసేపు గడపాలని అనుకుంటారు. అలాంటి వారి కోసం 'బే వ్యూ కాఫీ షాప్' ... మిగతా 6వ పేజీలో

అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ హాజరు

- తప్పనిసరిగా అమలు చేయాల్సిందిగా జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు
- ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభం
- చిన్నారులకు కూడా...
- అందుకు అనుగుణంగానే రేషన్ పంపిణీ
- పనితీరు మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి



విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా కేంద్రాల్లో పనిచేసే టీచర్లు, ఆయాలకు ఫేషియల్ అటెండెన్స్ (ముఖ హాజరు) విధానాన్ని తీసుకువచ్చింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి తప్పనిసరిగా ఎఫ్ఆర్ఎస్ అమలు చేయా లంటూ ఆదేశాలు అందాయి.

అంగన్‌వాడీ సిబ్బంది కొంతమంది సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ముఖ హాజరు విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని కొన్ని కేంద్రాల్లో రెండు నెలలపాటు అమలు చేసింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి జిల్లాలోని 776 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎఫ్ఆర్ఎస్ ద్వారా అటెండెన్స్ వేసే విధానాన్ని తీసుకువచ్చింది. సిబ్బంది తమ ఫోన్‌లోని బాల సంజీవని యాప్‌లో లాగిన్ అయి ఫేస్ అటెండెన్స్ వేసుకోవాల్సి ఉంటుంది. టీచర్, ఆయా ఇద్దరూ విధులకు వచ్చినప్పుడు ఒకసారి, సాయంత్రం మరోసారి ముఖ హాజరు వేసుకోవాల్సి ఉంటుంది.

ఇదీ లెక్క...

జిల్లాలోని 776 అంగన్‌వాడీ కేంద్రాల్లో ... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీ ఆస్తులకు ఎసరు

పార్కులు, ఓపెన్‌స్పేస్‌లు అన్యాక్రాంతం

- ప్రజా ప్రతినిధులు, నేతల సిఫార్సులతోనే... జీవీఎంసీ స్థలాలు అన్యాక్రాంతం
- అధికారంలో ఉన్న వారితో ప్రైవేటు వ్యక్తుల ఒప్పందాలు
- వైసీపీ హయాంలో బీజం
- కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతున్న వైనం



బటర్‌ఫ్లై పార్కు



కోటనరవ ఈడబ్ల్యూఎస్ లేఅవుట్ ఓపెన్ స్పేస్ స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నేతలు జీవీఎంసీకి చెందిన స్థలాలు, ఓపెన్ స్పేస్‌ల మార్పిడి వెనుక కీలకంగా వ్యవహరిస్తున్నారు. మధురవాడ ఎంఎస్ఆర్ లేఅవుట్‌లోని పార్కు స్థలం, కోటనరవలోని ఓపెన్‌స్పేస్ ప్రైవేటు వ్యక్తులకు బదలాయింపు నాడు, నేడు కూడా అధికారంలో ఉన్న నాయకులే చక్రం తిప్పారు. వాటి కోసం కొందరు వైసీపీ హయాంలో ప్రయత్నాలు ప్రారంభిస్తే కూటమి హయాంలో పూర్తికావడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

కొందరు నాయకులు ప్రజా సంక్షేమం, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కంటే తమ వ్యక్తిగత ప్రయోజనాలే పరమావధిగా వ్యవహరిస్తుంటారు. ఇది వైసీపీ హయాంలో మొదలైంది. ఆ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు జీవీఎంసీ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు బదలాయించాలని కోరుతూ తమ లెటర్‌హెడ్‌లపై అధికారులకు లేఖలు రాసే సంస్కృతిని ప్రారంభించారు. జీవీఎంసీ 88వ వార్డు పరిధి కోటనరవ వద్ద ఈడబ్ల్యూఎస్ లేఅవుట్ వెనుక ప్రైవేటు వ్యక్తులకు సుమారు 15 ఎకరాలు భూమి ఉంది. ఆ భూమికి ఐదు అడుగుల రోడ్డు మాత్రమే ఉంది. లేఅవుట్‌లో పార్కు నిమిత్తం కేటాయించిన స్థలంలో 180 గజాలు తీసుకుంటే ఐదు అడుగుల రోడ్డును 40 అడుగులకు విస్తరించుకోవచ్చునని, తద్వారా తమ భూముల విలువల పెంచుకోవచ్చునని భూముల యజమానులు భావించారు. దీనికోసం టీడీపీ నేత ద్వారా నాటి వైసీపీ ఎమ్మెల్యే ఒకరిని సంప్రదించారు. పార్కు స్థలాన్ని తమకు ఇస్తే, బదులుగా తమ భూమిలో అంతే స్థలాన్ని పార్కుకు కేటాయిస్తామంటూ ప్రతిపాదించారు. దీంతో సదరు ఎమ్మెల్యే పార్కు స్థలం మార్పిడికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని తన లెటర్ హెడ్‌పై జీవీఎంసీ అధికారులకు లేఖ రాసినట్టు తెలిసింది. దాని ఆధారంగా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆ పార్కు స్థలం ... మిగతా 6వ పేజీలో

వీసీ వార్నింగ్

- అనుబంధ కళాశాలల పనితీరుపై ఏయూ వైస్ చాన్సలర్ దృష్టి
- నిర్దేశిత ప్రమాణాలు పాటించాల్సిందేనని యాజమాన్యాలకు స్పష్టీకరణ
- అడ్డగోలు వ్యవహారాలు చేస్తే తొలుత ఎగ్జామ్ సెంటర్ రద్దు
- అప్పటికీ తీరు మార్చుకోని పక్షంలో కళాశాల గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరిక





విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):

'పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే...ఎగ్జామ్ సెంటర్ రద్దు చేస్తాం. అవసరమైతే కళాశాల గుర్తింపును రద్దు చేసేందుకు కూడా వెనుకాడబోం. ముఖ్యంగా లా, బీఈడీ కాలేజీల పనితీరు మెరుగుపర్చు కోవాలి'...ఇవీ అనుబంధ కాలేజీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ చేసిన వ్యాఖ్యలు.

వీసీ ఈ స్థాయిలో హెచ్చరికలు చేయడానికి అనేక కారణాలు ఉన్నట్టు చెబుతున్నారు. అనుబంధ కాలేజీల్లో ఇష్టారాజ్యంగా మాస్ కాపీయింగ్ జరుగుతోందని, అనేక కాలేజీల్లో ఫ్యాకల్టీ, ఇతర ... మిగతా 6వ పేజీలో

ఐదో వార్డులో పార్కుల ఆక్రమణపై హైకోర్టులో కేసు

- పిల్ దాఖలు చేసిన మధురవాడకు చెందిన మహిళ

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ ఐదో వార్డు పరిధిలోని పార్కుల అన్యాక్రాంతంపై హైకోర్టులో కేసు దాఖలైంది. బొట్టవానిపాలెం ఈడబ్ల్యూఎస్ లేఅవుట్‌లోని పార్కు, అదే ప్రాంతంలోని స్వతంత్ర నగర్ పార్కు, కృష్ణానగర్ సర్వే నంబర్ 166లోని లచ్చిరాజు లేఅవుట్‌లోని పార్కులను కొంతమంది కబ్జా చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌లను కోరినా స్పందన లేదని ఆరోపిస్తూ మధురవాడ ప్రాంతానికి చెందిన చేకూరి రజని ఈనెల తొమ్మిదో తేదీన హైకోర్టులో పిల్ దాఖలు ... మిగతా 6వ పేజీలో

రోజ్‌గార్ మేళా



యువతికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, విశాఖపట్నం రైల్వే డివిజనల్ మేనేజర్ లలిత్ బొహ్రా ఉన్నారు

యువతకు విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యువతకు విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. కైలాసపురం సాగర్‌మాల కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 52 మంది యువతీ, యువకులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు.

శ్రీలీల సందడి



ప్రముఖ సినీ నటి శ్రీలీల నగరంలో శనివారం సందడి చేశారు. జగదాంబ జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మాల్ ప్రారంభోత్సవానికి హాజరైన ఆమె అభిమానులతో కొద్దిసేపు మాట్లాడి, సెల్ఫీ తీసుకున్నారు. రెండు స్టెప్‌లు వేసి హుషారెత్తించారు.

సంక్షేమ పాలన కూటమికే సాధ్యం

» ఎమ్మెల్యే గంటా శ్రీనివారావు
» సాగర్‌నగర్‌లో 'తొలి అడుగు'

సాగర్‌నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కూటమి ప్రభుత్వానికే సాధ్యమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎలాంటి కోతలు లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేయడం ద్వారా తమ ప్రభుత్వం ప్రజల మన్ననలు అందుకుంటోందని తెలిపారు. శనివారం ఆయన సాగర్‌నగర్ కాలనీలో జరిగిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో మాట్లాడారు. రూ. 2 వేల పింఛన్ రూ. 3 వేలు చేస్తానని చెప్పిన జగన్ ఏడాదికి రూ. 250 చొప్పున ఐదేళ్లు ఇచ్చారని, ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ అమ్మఒడి పథకం కింద రూ. 15 వేలు చొప్పున ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక ఒకరికే ఇచ్చారని విమర్శించారు. కానీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే రూ. 3 వేల పింఛన్ ఒక్కసారిగా రూ. 4 వేలకు పెంచామన్నారు. అలాగే ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తున్నామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం 42 లక్షల మందికి అమ్మఒడి ఇవ్వగా తమ ప్రభుత్వం 67 లక్షల మందికి తల్లికి వందనం ఇచ్చిందని వివరించారు. కాగా సాగర్‌నగర్ కాలనీకి ఎక్కువ సంఖ్యలో బస్సు సర్వీసులు నడపాలని కోరుతూ మహిళలు ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. అలాగే భర్త చనిపోయిన మహిళ, ప్రమాదంలో కుమారుడ్ని పోగొట్టుకున్న మహిళ ప్రభుత్వం నుంచి సహాయం కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే సాగరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అక్కడ కొత్తగా నిర్మించిన షిర్డీ సాయి సాగరేశ్వరస్వామి కల్యాణ మండపంలో 8వ వార్డులోని 60 మంది ఆర్పీలకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్. అప్పారావు, జనసేన నాయకుడు శాఖరి శ్రీనివాస్, టీడీపీ నాయకులు చెట్టుపల్లి సన్యాసిరావు, బి. దొరబాబు, బి. వెంకటలక్ష్మి, అక్కరబోయిన రాంబాబు, లొడగల రామ్మోహన్, ఎల్లయ్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

రెల్లివీధిలో...

భీమునిపట్నం : ఎన్నికల హామీల్లో భాగంగా ప్రభుత్వం వచ్చే నెల నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేయనున్నట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తెలిపారు. శనివారం 3వ వార్డు రెల్లివీధిలో జరిగిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం పథకాలు, అభివృద్ధి పనులు గురించి ప్రజలకు వివరించారు. అనంతం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మారోజు సంజీవకుమార్, కొక్కిరి అప్పన్న, కాసరపు నాగరాజు, కుప్పిలి గురుమూర్తి, జలగడుగుల మురళీ, గూడపు రాజు, కుప్పిలి దుర్గ పాల్గొన్నారు.

వైసీపీ అక్రమాలపై విచారణ జరపాలి

ఎమ్మెల్యే గంటాకు జనసేన నాయకుల వినతి

ఆనందపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములవలస పంచాయతీకి చెందిన జనసేన నాయకులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆనందపురం పంచాయతీకి చెందిన కుప్ప రామలక్ష్మిని భీమిలి ఏఎంసీ డైరెక్టర్‌గా నియమించడంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేములవలస పంచాయతీ జనసేన మహిళా నాయకురాలు ఉప్పాడ యశోద స్థానిక సమస్యలను గంటా దృష్టికి తీసుకువచ్చారు. వేములవలస మార్కెట్‌లో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అనాధికారిక నిర్మాణాలు చేపడుతున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల పట్టాల మంజూరులో భారీ ఎత్తున అవినీతి జరిగిందని, అనర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి నిరుపేదలకు అన్యాయం చేశారని తెలిపారు. వీటిపై విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, తదితరులు పాల్గొన్నారు.


స్వామివారికి గరుడ సేవ చేస్తున్న వైదికులు

అప్పన్నకు వైభవంగా తులసీ దళార్చన

సింహాచలం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా శనివారం తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు. ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్ర నామావళి పఠించి, తులసీ దళాలతో అర్చన చేశారు. తరువాత గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి, గరుడ సేవ జరిపారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

ముగ్గురిని రక్షించిన లైఫ్‌గార్డులు


యువకులతో లైఫ్‌గార్డులు, పోలీసులు

సాగర్‌నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానానికి దిగి ప్రమాదానికి గురైన ముగ్గురు యువకులను లైఫ్‌గార్డులు రక్షించారు. కరీంనగర్ జిల్లాకు చెందిన బి. శ్రీనివాసరావు (28), ఎం. రామ్ (25), ఎ. శివ (20) శనివారం రుషికొండ బీచ్‌కు విహారానికి వచ్చారు. కాసేపు బీచ్‌లో విహరించిన వారు సముద్ర స్నానాలు చేసేందుకు ఉపక్రమించారు. ఈత కొడుతుండగా పెద్ద కెరటం వారిని తాకడంతో సముద్రంలోకి కొట్టుకుపోతుండగా సమీపంలో ఉన్న లైఫ్‌గార్డులు గమనించి, కాపాడారు. మెరైన్ పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ శ్రీనివాస్ యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చి, విడిచిపెట్టారు.

సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

పద్మనాభం రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ఏడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ సహకార శాఖ కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పద్మనాభం సొసైటీ అధ్యక్షుడిగా మొకర అప్పలనాయుడు (అన్నమయ్య), సభ్యులుగా కె.నారాయణప్పడు, కిలారి రమణ, రెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షుడిగా శ్రీరాములు, సభ్యులుగా కృష్ణ. కె. అప్పలనాయుడు, గంధవరం సొసైటీ అధ్యక్షుడిగా గణేష్, సభ్యులుగా సన్యాసినాయుడు, రొంగలి అప్పల సూర్యనారాయణ, పాండ్రంగి సొసైటీ అధ్యక్షుడిగా బి. శ్రీనివాసరావు, సభ్యులుగా దొంతల అప్పలనయుడు, పాండ్రంగి అప్పలనాయుడు, మధురవాడ సొసైటీ అధ్యక్షుడిగా ప్రసాద్, సభ్యులుగా బి. పైడిరాజు, పి.వి. మీనాక్షి, మజ్జివలస సొసైటీ అధ్యక్షుడిగా గుండాల ఎల్లయ్య, సభ్యులుగా కె. రమణ. కె. సత్యనారాయణ, శొంఠ్యాం సొసైటీ అధ్యక్షుడిగా గండ్రెడ్డి సొంబాబు. సభ్యులుగా దేముడు, జి. వెంకటరావును నియమించారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారానికి కూటమి శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి.

ఆర్‌పీలకు ట్యాబ్‌లు పంపిణీ

మధురవాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని ఆర్‌పీలకు ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ శనివారం తన నివాసం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్యాబ్‌ల ద్వారా ఆర్‌పీలు డ్వాక్రా మహిళలకు మరింత మెరుగైన సేవలు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, కూటమి నాయకులు నరసింహనాయుడు, సూర్యప్రకాశరావు, అచ్యుతరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి దుర్గారావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ శిక్షణ తరగతులు ప్రారంభం

తగరపువలస, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌ఎం ఎంఎస్ ఉచిత శిక్షణ తరగతులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. పాఠశాలలకు సెలవు రోజుల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి, మెటీరియల్ కూడా అందిస్తారు. ఈమేరకు తరగతులను ఇంగ్లీషు ఉపాధ్యాయుడు గంటాన మోహనరావు ప్రారంభించారు. చిట్టివలస. లక్ష్మీపురం, చిన ఉప్పాడ, కాపులుప్పాడ, వెంకటాపురం గ్రామాలకు చెందిన 120 మంది విద్యార్థులు తొలి రోజు తరగతులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, వైవీ రమణ, దుష్యంతు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చెత్త డబ్బాలతో దుర్వాసన

తగరపువలస, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస కూడలిలో బంతాట మైదానం వద్ద జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది చెత్త సేకరించే డబ్బాలను ఉంచడంతో దుర్వాసనకు పలువురు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి మైదా నంలో ఉదయం, సాయంత్రం వేళ క్రీడాకారులు ఆటలు ఆడుతుంటారు. సాయంత్రం రిటైర్డ్ ఉద్యోగులు సమీపంలో ఉన్న సిమెంటు బెంచీలపై కూర్చుని సేద తీరుతుంటారు. మైదానం వద్ద చెత్త సేకరణ డబ్బాలు ఉంచ డంతో వారంతా దుర్వాసనకు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి చెత్త సేకరణ డబ్బాలను మైదానా నికి కొంత దూరంలో ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

తహశీల్దార్ దృష్టికి దళితుల సమస్యలు

ఆనందపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : నూతన తహశీల్దార్ సూరిశెట్టి శ్రీనుబాబును మాల మహానాడు నాయకులు శనివారం రెవెన్యూ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు బాగం గోపాలరావు మాట్లాడుతూ మండలంలో దళితులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర మాల మహానాడు కన్వీనర్ ఎంవీ శివ, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి సియ్యాంద్రి రాంబాబు, భీమిలి మాల మహానాడు కన్వీనర్ బోని సన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సర్కారు భూమికి స్కెచ్

... 5వ పేజీ తరువాయి

రెవెన్యూ సిబ్బంది వెళ్లి అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిలో ఎటువంటి ఆక్రమణలకు పాల్పడకూడదని స్పష్టంచేశారు. ఇప్పుడు అదే ప్రాంతంలో ఐదు ఎకరాలను ఒకరికి కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, కలెక్టర్ జోక్యం చేసుకుని అక్రమార్కుల కుట్రలను తిప్పికొట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

డిపట్టాలు రద్దు

రైవాడ కాలువ, పేద వర్గాలకు ఇళ్ల కోసం సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం గ్రామంలో సుమారు 20 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ప్రభుత్వ అవసరాలకు డీపట్టా భూములు వెనక్కి తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. రైవాడ కాలువ, ఇళ్ల కోసం అప్పట్లో కొన్ని డీపట్టా భూములు వెనక్కి తీసుకుని సదరు పట్టాలు రద్దు చేసింది.

మురుగు కాలువ పూడ్చివేత

తగరపువలస, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస బంగ్లామెట్ట సమీపంలో ఉన్న మురుగు కాలువను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కప్పివేస్తున్నారు. ఇక్కడి జిరాయితీ స్థలంలో పలు నిర్మాణాలు చేపడుతున్న వారికి కాలువ అడ్డంగా ఉండడంతో సమీపంలో ఉన్న మట్టిని కుప్పలుగా పోశారు. తగరపువలసలోని పలు ప్రాంతాలకు చెందిన వాడుక నీరు, వర్షం నీరు ఈ కాలువ (బంటా) మీదుగా ప్రవహించి గోస్తనీ నదిలో కలుస్తుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మురుగు కూడా ఈ కాలువలోనే కలుస్తుంది. దీని పరిసర ప్రాంతాల్లో జిరాయితీ స్థలాలు ఉండడం, ఆయా స్థలాలకు విలువ పెరగడంతో కాలువను కప్పివేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాలువను కప్పివేసి ఎత్తుగా చేస్తే వాడుక నీరు మరో ప్రాంతం నుంచి వెళ్లే అవకాశం ఉంది. అయితే దీని సమీపంలో అన్నీ నివాస గృహాలు ఉండడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై వారు అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.


మట్టితో కప్పివేసిన కాలువ

అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించాలి

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గోవిందరావు



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

తగరపువలస, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలు చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని, వారిపై అదనపు పని భారం తగ్గించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవిందరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జీఆర్ భవన్‌లో జరిగిన భీమిలి ప్రాజెక్టు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనాలు పెంచాలని కోరుతున్నా.. ప్రభుత్వం దాటవేత ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. కార్యకర్తలపై రకరకాల యాప్‌ల పేరుతో పనిభారం పెంచుతున్నారని, దీనివల్ల వారు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మొబైల్ ఫోన్లు ఇచ్చినా.. అవి సక్రమంగా పని చేయడం లేదని చెప్పారు. తగరపువలస ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు మాట్లాడుతూ పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సదుపాయాలు కావాలంటే కార్యకర్తలు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భీమిలి ప్రాజెక్టు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు లక్ష్మీపార్వతి, పొట్నూరు సీత, విజయ పాల్గొన్నారు.

జీవీఎంసీ ఆస్తులకు ఎసరు

... 5వ పేజీ తరువాయి

మార్పిడికి నాటి మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్‌వర్మ ద్వారా ముందస్తు ఆమోదం తీసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ఈలోగా ఎన్నికలు వచ్చాయి. కూటమి అధికారంలోకి వచ్చింది. దాంతో కూటమిలో ప్రజా ప్రతినిధిగా ఉన్న ఒకరు ఆ బాధ్యతను తన భుజాన వేసుకున్నారు. అంతే..భూమార్పిడికి వీలుగా ఈ ఏడాది మే నెలలో మెమో అయ్యింది. అదేమాదిరిగా జీవీఎంసీ ఆరో వార్డు పరిధి మధురవాడ ఎంఎస్‌ఆర్ లేఅవుట్‌లోని బటర్‌ఫ్లై థీమ్ పార్క్ వెనుక ఉన్న రెండు ఎకరాల భూమికి రోడ్డు సదుపాయం లేదు. పార్కులోని కొంతస్థలం ఇస్తే ఆ భూమికి రోడ్డు సదుపాయం ఏర్పడుతుంది. వైసీపీ హయాంలో ఇద్దరు రియల్టర్లు అప్పటి ప్రజా ప్రతినిధి ద్వారా పార్కుస్థలం మార్పిడికి ప్రయత్నించారు. సదరు ప్రజా ప్రతినిధి ద్వారా జీవీఎంసీలో పావులు కదిపారు. రాష్ట్రప్రభుత్వానికి ప్రతిపాదన చేరింది. నిర్ణయం తీసుకునేలోగా ఎన్నికలు వచ్చాయి. ప్రభుత్వం మారింది. దాంతో కూటమికి చెందిన నాయ కుడిని ఆశ్రయించారు. పార్కు స్థలం మార్పిడికి సహకారం అందించాలని కోరారు. ఈ క్రమంలో ఒక మంత్రి పార్కుస్థలం మార్పిడికి వీలుగా చర్యలు తీసుకునేందుకు కమిటీని ఏర్పాటుచేయడం, ఆ కమిటీ అనుకూలంగా నివేదిక ఇవ్వడం..ప్రభుత్వం మెమో జారీచేయడం చకచకా జరిగిపోయాయి. అయితే బటర్‌ఫ్లై థీమ్ పార్క్ స్థల మార్పిడిపై హైకోర్టులో పిల్ దాఖలు కావడంతో ధర్మాసనం స్టే విధించింది. కానీ, జీవీఎంసీ స్థలాలు అన్యాక్రాంతం కావడానికి నాయకులే కీలకంగా వ్యవహరించడం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

కొంగొత్తగా కైలాసగిరి

... 5వ పేజీ తరువాయి

నిర్మాణం ప్రతిపాదించారు. ప్రముఖ పర్యాటక దేశమైన సింగపూర్‌లో సెంటోసా ఐల్యాండ్‌లో 'లూజ్ గ్రావిటీ రైడింగ్' ప్రత్యేకమైనది. చిన్న, పెద్ద తేడా లేకుండా ఇంటిల్లపాదీ ఎంజాయ్ చేసేలా ఉంటుంది. గో కార్టింగ్ తరహాలో ఉండే ఈ రైడ్ భూమి ఆకర్షణ శక్తితో పని చేస్తుంది. దాని కోసం ప్రత్యేక ట్రాక్ కూడా ఉంటుంది. దీనిని కైలాసగిరిపై పెట్టనున్నారు.

మరింత పొడవుగా రోప్‌వే

ప్రస్తుతం కైలాసగిరికి వెళ్లడానికి అప్పుఘర్ వద్ద రోప్ వే ఉంది. చాలా చిన్న పెట్టెలతో నడుపుతున్నారు. ప్రయాణ దూరం కూడా తక్కువే. దీని స్థానంలో కొత్త తరహా రోప్ వే ప్లాన్ చేశారు. సుమారు 1.5 కి మీ. దూరం అందులో ప్రయాణించేలా..ఆ సమయంలో సముద్రం అందాలు కనువిందు చేసేలా ఆ మార్గాన్ని తీర్చిదిద్దుతారు. అంతేకాకుండా ఈ ప్రాజెక్టు స్థలం వద్దే కార్లు పార్కింగ్ చేసుకునే సౌకర్యం కూడా కల్పించనున్నారు. ఈ రోప్‌వేను విస్తరించడం వల్ల ఆ చివరనున్న తెలుగు మ్యూజియానికి కూడా సందర్శకులు పెరుగుతారని అధికారులు భావిస్తున్నారు.

అన్నింటికీ ఆర్‌పీఎఫ్‌లు పిలిచాం

- ప్రణవ్ గోపాల్, ఛైర్మన్, వీఎంఆర్‌డీఏ

కైలాసగిరిని ప్రత్యేక ఆకర్షణగా మార్చాలనేది సీఎం చంద్రబాబు ఆదేశం. ఆ మేరకు కమిషనర్ విశ్వనాథన్‌తో చర్చించి ఈ ప్రాజెక్టులు అన్నింటికీ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ ఆహ్వానించాం. వీటిని వీలైనంత త్వరగా నిర్మించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని యత్నిస్తున్నాం.

వీసీ వార్నింగ్

... 5వ పేజీ తరువాయి

సిబ్బంది లేరని ఆయనకు ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా లా, బీఈడీ కాలేజీలు దారుణంగా వ్యవహరిస్తున్న విషయాన్ని ఆయన గుర్తించారు. కొన్నాళ్ల కిందట ఒక బీఈడీ కాలేజీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన అక్కడ సిబ్బంది లేరని తెలుసుకుని తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. ఆ తరువాత అనేక కాలేజీలకు సంబంధించి సమాచారాన్ని ఆయన తెప్పించుకున్నారు. కొన్ని కాలేజీలు విద్యార్థులు తరగతులకు రాకపోయినా డబ్బులు తీసుకుని పరీక్షలకు అనుమతిస్తున్నాయి. అదేవిధంగా పరీక్షల్లో కూడా మాస్ కాపీయింగ్‌కు ప్రోత్సహిస్తున్నాయి. దీంతో వర్సిటీ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. ఇకపై అటువంటి వ్యవహారాలకు అడ్డుకట్ట వేయాలని వైస్ చాన్సలర్ నిర్ణయం తీసుకున్నారు.

అనుబంధ కాలేజీలపై పర్యవేక్షణ.?

ఏయూ అనుబంధంగా ఉన్న డిగ్రీ, పీజీ, బీఈడీ, న్యాయ కళాశాలలను నిరంతరం పర్యవేక్షించాలని ఇప్పటికే వీసీ ఆదేశాలు జారీచేశారు. కళాశాలల్లో తప్పనిసరిగా మౌలిక వసతులు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా భవనాలు, ఫ్యాకల్టీ ఉండాలని....లేనిపక్షంలో అనుమతులు ఇవ్వొద్దని స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చారు. లా, బీఈడీ కాలేజీల్లో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారాలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు చెబుతున్నారు. తీరు మార్చుకోని పక్షంలో తొలుత పరీక్ష కేంద్రంగా ఉన్న అవకాశాన్ని తప్పించనున్నారు. అప్పటికీ మార్పు రాకపోతే కాలేజీకి ఉన్న గుర్తింపును రద్దు చేయనున్నట్టు చెబుతున్నారు. వీసీ హెచ్చరికతో అడ్డగోలుగా నడుస్తున్న బీఈడీ, న్యాయ కాలేజీల యాజమాన్యాల్లో ఆందోళన మొదలైంది. అయితే వైస్ చాన్సలర్ హెచ్చరికలకే పరిమితం అవుతారా?, లేక అటువంటి కాలేజీలను గుర్తించి చర్యలకు దిగుతారా.?...అనేది చూడాల్సి ఉందని వర్సిటీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

ఐదో వార్డులో పార్కుల ఆక్రమణపై హైకోర్టులో కేసు

... 5వ పేజీ తరువాయి

చేశారు. దీనిని కోర్టు విచారణకు స్వీకరించింది. ఈనెల 19న విచారణకు హాజరుకావాలని పిటిషనర్‌తోపాటు జీవీఎంసీ అధికారులను ఆదేశించింది. బొట్టవానిపాలెం, స్వతంత్ర నగర్ పార్కులను కొంతమంది ఆక్రమించుకుని, తప్పుడు పత్రాలతో విద్యుత్ కనెక్షన్ తీసుకుని పక్కా నిర్మాణాలకు సిద్ధం అవుతున్నారని, లచ్చిరాజు లేఅవుట్‌లోని పార్కులో నిర్మాణాలు చేపడుతున్నారంటూ ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టులో పిల్ దాఖలైన విషయం తెలియగానే జోన్-2 టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆగమేఘాల మీద వెళ్లి పార్కులో నిర్మించిన షెడ్‌ను తొలగించారు. ఇదిలావుండగా నగరంలో పార్కుల అన్యాక్రాంతంపై మేయర్ పీలా శ్రీనివాసరావు శుక్రవారం అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి పూర్తి వివరాలు సమర్పించాల్సిందిగా ఆదేశించారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ హాజరు

... 5వ పేజీ తరువాయి

731 మంది మెయిన్ టీచర్లు, మరో 35 మంది మినీ టీచర్లు, 692 మంది ఆయాలు పనిచేస్తున్నారు.ఆయా కేంద్రాల పరిధిలో గర్భిణులు 9,354 మంది, బాలింతలు 8,098 మంది, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 52,837 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 42,988 మంది ఉన్నారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు కూడా ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరును వేస్తున్నారు. చిన్నారుల సంఖ్యకు అనుగుణంగా రేషన్‌ను పంపిణీ చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. దీనివల్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగే అవకతవకలకు అడ్డుకట్టే వేసేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

భీమిలి ఏఎంసీ డైరెక్టర్‌గా నందిని

పద్మనాభం రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : తునివలస గ్రామానికి చెందిన టీడీపీ నాయకురాలు ఓల్ల నందినిని భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎంపిక చేశారు. ఈమేరకు ఆమె ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావును శనివారం ఉదయం నగరంలో ఉన్న ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



రైల్వే ప్రాజెక్ట్‌లపై సమీక్షిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు. చిత్రంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, సీఏఓ అంకుశ్ గుప్తా, తదితరులు ఉన్నారు

రైల్వే స్టేషన్లలో వసతులు మెరుగుపడాలి

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్లన్నీ వసతుల పరంగా మెరుగుపడాలని, ప్రయాణికుల సంతృప్తే ధ్యేయంగా పనిచేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు సూచించారు. డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో శనివారం ఆయన రైల్వే ప్రాజెక్ట్‌లు, పనులపై సమీక్షించారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి అంకుశ్ గుప్తాలు వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పెంచుతున్న మౌలిక సదుపాయాలను కేంద్ర మంత్రికి వివరించారు. విశాఖ రైల్వే స్టేషన్ రీ డెవలప్‌మెంట్, రోడ్ ఓవర్ బ్రిడ్జిల పనుల పురోగతి గురించి తెలిపారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ ఉండాలని సూచించారు. అమృత్‌స్టేషన్లు, రైలు స్టాపులు, రైళ్ల పొడిగింపుల గురించి అడిగి తెలుసుకున్నారు.డివిజన్‌లో డబుల్ లైన్, మూడు, నాలుగో లైన్ల పనుల గురించి ఆరా తీశారు. సమావేశంలో అసిస్టెంట్ డీఆర్ఎంలు మనోజ్ కుమార్ సాహూ, శాంతారామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి'


కార్మికుడికి మందులు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా

ఎండాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛంద సంస్థలు, పలు ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియో గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. శారీరకంగా కష్టపడే కార్మికులకు ఆరోగ్య పరిరక్షణ ఎంతో అవసరమని, అందుకు ప్రతిఒక్కరూ తమ వంతు సహాయం అందించాలన్నారు. కార్మికుల కోసం క్రెడాయ్ విశాఖ శాఖ, ఎంకేవన్ బిల్డర్స్, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) సంయుక్తంగా ఎండాడలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. శిబిరంలో పలు నిర్మాణ సంస్థల్లో పని చేస్తున్న 500 మంది కార్మికులకు వైద్యులు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ కార్యనిర్వాహక సభ్యులు, యువజన, మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

16న ఈమా లైమ్ లైట్స్ అవార్డులు

ఎండాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ (ఈఎంఏ) విశాఖ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16న ప్రతిభావంతులైన కళాకారులతో పాటు 60 విభాగాల్లో రాణిస్తున్న వారికి అవార్డులు అందించనున్నట్టు ఈమా అధ్యక్ష, కార్యదర్శులు సందీప్‌కుమార్, షరీఫ్‌ఖాన్, కామాక్షీ క్రాఫ్ట్ అధినేతలు గుట్టవిల్లి వెంకటేష్, సిరి దంపతులు తెలిపారు.శనివారం వారు ఎండాడ-రుషికొండ డబుల్ రోడ్డులో ఉన్న కామాక్షి క్రాఫ్ట్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఏడాదిలానే ఈసారి కూడా ఈఎంఏ లైమ్ లైట్స్ అవార్డులు అందిస్తున్నామని చెప్పారు. గాదిరాజ్ ప్యాలెస్‌లో ఈ కార్యక్రమంలో జరుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో ఈమా కార్యవర్గం సభ్యులు సురేశ్ కుమార్, జీఎన్ రాజు, సంతోష్‌కుమార్, కామేష్, ఆనంద్, ఆశా పట్నాయక్, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం

సింహాచలం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి విజయవాడకు చెందిన డి. శ్రీనివాస అరవింద వర్మ, నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన బి. నాగేశ్వరరావు దంపతులు లక్ష రూపాయల చొప్పున విరాళంగా సమర్పించారు. విరాళాలను నగదు రూపంలో దేవస్థానం అధికారులకు శనివారం వారు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాతల కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి, శేషవస్త్రాలతో సత్కరించారు.

పూడికలతో రాళ్ల చెరువు

మధురవాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు నగరంపాలెంలో ఉన్న రాళ్ల చెరువు పూడికలతో నిండిపోయింది.ఒకప్పుడు ఏడాదిలో పది నెలలు నీటితో కళకళలాడే ఈ చెరువు ప్రస్తుతం తుప్పలు, మొక్కలతో కళావిహీనంగా కనిపిస్తోంది. సుమారు 15 ఏళ్ల కిందట జలయజ్ఞంలో భాగంగా ఈ చెరువులోని పూడికలను స్థానికులు శ్రమదానంతో తొలగించి, గట్లు పటిష్టం చేశారు.నాటి నుంచి చెరువు నిర్వహణను ఎవరూ పట్టించుకోలేదు. దీంతో పూడికలు, తుప్పలతో నిండిపోయింది. చెరువు పూర్తిగా నీటితో ఉంటే నగరంపాలెం, పోర్టు కాలనీ, స్వతంత్రనగర్ కాలనీ, వాంబే కాలనీ ప్రాంతాలకు భూగర్భ జలాలు పెరుగుతాయి. అధికారులు స్పందించి చెరువులో పూడికలు, తుప్పలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


తుప్పలతో నిండిన చెరువు గర్భం

ఖాళీగా సచివాలయాలు

- బదిలీల ప్రక్రియ ముగిసినా.. కొత్త స్థానాల్లో చేరని సిబ్బంది
- పాత స్థానాలపైనే మొగ్గు
- బదిలీ స్థానాల్లో చేరేందుకు ససేమిరా
- సిఫార్సుల కోసం నేత చుట్టూ ప్రదక్షిణలు
- కొన్ని చోట్ల రిలీవ్ కావడంతో సిబ్బంది కొరత



ఖాళీగా ఉన్న మద్దిలపాలెం సచివాలయం

మద్దిలపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-3 పరిధిలోని సచివాయాలు 90 శాతం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం సచివాలయాల్లో ఒకరిద్ద రు మాత్రమే ఉంటున్నారు. వార్డు సచివాలయల ఉ ద్యోగుల హేతుబద్ధీకరణ, బదిలీలు చేపట్టడంతో ఈ ప రిస్థితి నెలకొంది. జోన్-3లో 73 సచివాలయాలున్నా యి. ఆయా సచివాలయాల్లో 380 మంది కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే అయిదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన ఉద్యోగులకు స్థాన చలనం చేయాలని రా ష్ట్ర ప్రభుత్వం జూన్ 13న ఉత్తర్వులిచ్చింది. జూన్ 31 నాటికి బదిలీలు ప్రక్రియ పూర్తి చేసి, జూలై 10వ తేదీ లోపు బదిలీ జరిగిన స్థానాల్లో విధుల్లో చేరాలని పేర్కొంది.

కాగా జోన్-3లో అయిదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన 252 మంది బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నారు. అధికా రులు వారికి కౌన్సెలింగ్ నిర్వహించి స్థానచలనం కలి గించారు. బదిలీ జరిగిన ఉద్యోగుల స్థానాల్లో ఇతర ప్రాంతాల సచివాలయాల ఉద్యోగులను నియమించా రు. ఈ నెల 5వ తేదీన బదిలీల కౌన్సెలింగ్ జరిగినా.. ఇప్పటి వరకు ఉద్యోగులు విధుల్లో చేరలేదు.

బదిలీలు ప్రక్రియ ముగిసినా.. ఇంకా సిఫార్సులు

జోన్-3లో సచివాలయాల్లో బదిలీల ప్రక్రియ ముగి సినా సిఫార్సులు ఆగలేదు. బదిలీ అయినప్పటికీ కొంత మంది ఉద్యోగులు కొత్త ప్రాంతానికి వెళ్లేం దుకు ఇష్టపడడం లేదు. అలాగే ఇక్కడకు బ దిలీపై వచ్చేవారు విధుల్లో చేరడానికి ఆసక్తి చూపడం లేదు. కొంతమంది తమ బదిలీలు ఆపుకోవడానికి ఇప్పటికీ ప్రజాప్రతినిధులు చుట్టూప్రదక్షిణలు చేస్తున్నారు. సిఫార్సులతో బదిలీలు ఆగుతాయని కొందరు రిలీవ్, జా యినింగ్‌ల ప్రక్రియకు ముందుకు రావడం లేదు. అయిదేళ్లగా ఒకే ప్రాంతాల్లో పాతుకు పోవడంతో ఏవిధంగా నైనా ఉన్నచోటే ఉం డాలని కార్యదర్శులు తమ స్థాయిలో ప్రయ త్నాలు చేసుకుంటున్నారు. వీరి ప్రయత్నాలు ఎలా ఉన్న సచివాలయాల్లో ఉద్యోగులు చేరకపోవడం ప్రజలకు ఇబ్బందులు ఎదరవుతున్నాయ. పూర్తిస్థాయి సిబ్బంది లేక సేవలు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం కొ త్త రేషన్‌కార్డులు, కార్డుల్లో మార్పులు చేర్పులు వంటి సేవలు జరుగుతున్నందున లబ్ధిదారులు ఆయా సేవ లకు దూరమవుతున్నారు. రోజూ సచివాలయాల చు ట్టూ తిరుగుతూ సిబ్బంది లేక అసహనం వ్యక్తం చేస్తు న్నారు. సచివాలయాల్లో పూర్తి స్థాయి సిబ్బంది ఉంటూ సేవలు అందుబాటులోకి తెచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

ఆరిలోవ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి సుమారు ఆరు గంటల వరకు విద్యుత్ నిలిపి వేయడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఎలాంటి ముందుస్తు సమాచారం లేకుండా ఈ విధంగా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపి వేయడం తగదని అంటున్నారు. అసలు ఎందుకు సరఫరా నిలిపి వేశారు. ఎప్పుడు పునరుద్ధరిస్తారు అని అడుగుదా మన్నా విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని, ఉన్నా సరైన సమాధానం చెప్పడం లేదంటూ స్థానికులు మండిపడు తున్నారు. గత నాలుగు రోజుల నుంచి తీవ్ర ఎండలు, ఉక్కపోత ఉండడంతో విద్యుత్ సరఫరా లేక అనేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైనా అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

శాంతి ఆశ్రమం కేసులో మరో ముగ్గురి అరెస్టు

ఎంవీపీ కాలనీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : శాంతి ఆశ్రమం కేసులో ఎంవీపీ పోలీసు లు మరో ముగ్గురి నిందితులను అరెస్టు చే శారు. గడచిన కొంత కాలంగా లాసన్స్ బే కాలనీ వద్ద ఉన్న శాంతి ఆశ్రమం స్థలం విషయంలో రెండు వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ఇటీవల ఓ వర్గానికి న్యాయ స్థానం తీర్పు అనుకూలంగా వచ్చింది. అ యినప్పటికీ సదరు స్థలాన్ని ఓ వర్గం అ ప్పగించలేదు.

ఇదిలావుండగా, ఇరు వర్గాలు గొడవ పడుతూ రౌడీ షీటర్లను రంగంలోకి దించా యి. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, అందరిపై కే సులు నమోదు చేసి అరెస్టులు చేయిస్తు న్నారు. ఇప్పటికే 25 మంది నిందితులను హత్యాయత్నం కేసులో అరెస్టు చేసి జైలు కు పంపించారు.

తాజాగా ఓ వర్గానికి చెందిన సిద్ధు అనే వ్యక్తి భార్య మాధురి, చెల్లెలు శ్రీదేవి, మరో మహిళ మధురను అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఘర్షణల్లో వీరు కూడా పా ల్గొన్ని ప్రత్యర్థులపై రాళ్లు విసిరినట్లు ఫిర్యా దు ఉంది. కాగా ఈ కేసులో ఇంకా ప్రధాన నిందితులు అరెస్టు కావాల్సి ఉంది.

నేడు వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో

ఫ్యామిలీ గేమ్ నైట్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రణవ్‌గోపాల్

సిరిపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ, వీరుమామాస్ ఆధ్వర్యంలో ఈ నెల 13న ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు ఫ్యామిలీ గేమ్ నైట్ ఈవెంట్ జరగనుందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ తెలిపారు. అందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తూ కుటుంబమంతా కలిసి ఆడి, పాడి బహుమతులు గెలుచుకునే వి ధంగా రూపొందించినట్లు తెలిపారు. అంద రూ హాజరై విజయవంతం చేయాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ కోరారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 30, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 36, బీరకాయలు 44, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 44, దొండకాయలు 38, బంగాళ దుంపలు18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 62, అల్లం (పాతది) 46, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 34, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 84, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 32, జామ కాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

రామ్‌నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధి పట్ల తూర్పు నియోజకవర్గంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుండడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. శనివారం 28వ వార్డులోని ఊటగడ్డలో టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ నక్కా కనకరాజు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి స్థానికంగా ఇంటింటికీ వెళ్ళి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు.త్వరలోనే సూపర్-6 సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ స్థానిక నాయకులు ఉరుకూటి పైడిరాజు, పోలిపల్లి సురేష్, పళ్ళ శ్రీను, కనకమహాలక్ష్మి, డోకర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డులో..

వెంకోజీపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డులోని పాత వెంకోజీ పాలెం శెట్టిబలిజ వీధి బూత్ నెంబరు 272లో టీడీపీ నాయకులు చెల్లిబోయిన గోవింద్ ఆధ్వర్యంలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని జరిగింది. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, ఇతర నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలన గురించి వివరించారు. ప్రజా సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అవలంబిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దాదాపు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేసిందని, త్వరలో మిగిలినవి కూడా ప్రజలకు అందిస్తారని కార్పొరేటర్ శ్రీవిద్య తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంపంగి సురేష్, కేసుబోయిన సత్తిబాబు, కె.రాజు, కె.రామకృష్ణ, నోట్ల శ్రీను, తెకుపూడి రాజు, సంపంగి వాసు, టీడీపీ నాయకులు, బూత్ ఏజెంట్‌లు పాల్గొన్నారు.

వర్షం వస్తే ఇళ్లల్లోకి కరెంట్ ప్రవాహం

- విద్యుదాఘాతం భయంలో హెచ్‌బీ కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఆనుకుని ఉన్న నివాసితులు
- ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం



బీటలు వారడంతో వర్షం వచ్చినపుడు వరద నీరు ప్రవహించే ప్రాంతం

వెంకోజీపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డు దుర్గానగర్ కొండవాలు ప్రాంతంలోనున్న హెచ్‌బీ కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఆనుకుని ఉన్న ఇండ్లకు మధ్యనున్న ప్రహరీ బీటలు వారడంతో అప్పుడప్పుడు విద్యుత్ సరఫరా అవుతోంది. దీంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇక్కడున్న మురుగునీరు పోయే కాలువకు అడ్డుగా దిగువ ప్రాంతంలో ఓ స్థానికుడు ఇంటిని నిర్మించడంతో మురుగునీరు రాకుండా ప్రహరీ కూడా నిర్మించాడు. దీంతోపాటు సబ్‌స్టేషన్ ప్రహరీ గోడ బీటలు వారడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరంతా బీటలు వారిన గోడ ద్వారా సబ్‌స్టేషన్‌లోకి వెళుతోంది. ఇది రోజూ సాధారణంగా వెళ్లే మురుగునీటితో పాటు వర్షం పడినప్పుడు పై ప్రాంతం నుంచి వరద మొత్తం సబ్‌స్టేషన్‌లోకి బీటలు వారిన ప్రహరీ ద్వారా ప్రవహిస్తుంది. దీంతో సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా వెనక్కి ప్రవహించి, ఈ గోడకు ఆనుకుని ఉన్న ఇండ్లకు సరఫరా కావడంతో వర్షం పడినప్పుడల్లా నివాసులు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని గడపాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

స్పందించని అధికారులు

ఈ విషయమై విద్యుత్ శాఖాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాము ఉండే ప్రాంతంలో భీమిలి నియోజకవర్గానికి చెందినది కావడంతో తమ సమస్యను ఇక్కడ కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై శ్రద్ధ చూపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సబ్‌స్టేషన్‌కు, తమకు మధ్య ఉన్న గోడను పునర్నిర్మించాలని, దిగువ ప్రాంతంలోని మురుగు కాలువకు అడ్డుగా నిర్మించిన ఇంటి యజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మురుగు నీరు వెళ్లే అవకాశం లేకుండా నిర్మించిన గోడ

అదృశ్యం కేసుల్లో వీడని మిస్టరీలు

భీమునిపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మ, వీఆర్‌ఓ బడే శ్రీను అదృశ్యం కేసుల మిస్టరీ వీడడం లేదు. సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ వ్యక్తుల ఆచూకీ లభించకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి చెందుతున్నారు. భీమిలి తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని కాపులుప్పాడ వీఆర్వోగా పనిచేసిన బడే శ్రీను (24) విధి నిర్వహణలో భాగంగా 2022 నవంబరు 4న మంగమారిపేటలో ఉన్న అతని ఇంటి నుంచి విజయవాడ సీసీఎల్‌ఏకు బయలుదేరాడు. మరుసటి రోజు రాత్రి 8.47కు అతడి అన్నయ్య సతీష్‌కు ఫోన్ చేసి రాజమండ్రిలో ఉన్నట్టు తెలిపి, పని అయిపోయింది బయలుదేరి వచ్చేస్తున్నానని చెప్పాడు. తర్వాత నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. బాధితులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. ఎస్‌ఐ ఆధ్వర్యంలో నాలుగు బృందాలు ఇక్కడి నుంచి రాజమండ్రి వెళ్లాయి. కాల్ డేటా ఆధారంగా కేసు విచారణ చేపట్టారు. కానీ ఇప్పటికీ ఆచూకీ లభించలేదు. అలాగే చోడేశ్వరాలయం అర్చకుడు ఏడిద గణేశ్ సుబ్రహ్మణ్య శర్మ రెండు నెలలుగా కనిపించడం లేదు. ఈ కేసు విచారణలో పోలీసుల తీరు పలు విమర్శలకు దారితీస్తుంది. కేసును గోప్యంగా ఉంచడంలో పోలీసుల అంతర్యం ఏమిటోనని పలువురు అనుమానిస్తున్నారు. ఇటీవల తిరుపతి వెళ్లిన ప్రత్యేక పోలీసు బృందం అర్చకుడు సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకోవడం తప్ప మరే ఆధారాలు లభించలేదు.

ఎండ దెబ్బకు జనం విలవిల

- చెరకు రసం బండ్లు, జ్యూస్ దుకాణాల వద్ద రద్దీ



పెదగదిలిలోని ఓ జ్యూస్ సెంటర్ వద్ద రద్దీ

ఆరిలోవ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులు నుంచి ఎండలు మండిపోతుండడం, ఉక్కపోతతో జనం ఇబ్బంది పడుతున్నారు. పగటి పూట అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు గాలి లేకపోవడంతో ఉక్కపోతకు గురవుతున్నారు. వేసవిని తలపించేలా వాతావరణం ఉండడంతో ఎండ బాధ నుంచి ఉపశమనం పొందేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎండ దెబ్బకు బయటకు రావడానికే భయ పడుతున్నారు. తప్పనిసరై బయటకు వచ్చే వారు ఎండ వేడిమి నుంచి తప్పించుకునే క్రమంలో శీతల పానీయాలు వంటివి తీసుకొంటున్నారు. పెదగదిలి జంక్షన్‌లో రోడ్డు పక్కన ఉన్న చెరకు రసాలు, జ్యూస్ బండ్ల వద్ద రద్దీ కనిపించింది. కాగా, గత రెండు రోజులు విద్యాసంస్థలు, కార్యాలయాలకు సెలవులు కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊరట పొందారు.

ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం సందర్శించిన ఏపీ లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్



ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం సందర్శిస్తున్న కమిటీ చైర్మన్ కూన రవికుమార్

సిరిపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పర్యటిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలపై ఏర్పాటైన ఏపీ లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్, సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కాంట్రాక్టర్ ఐజాక్ భాషా తదితరులు బీచ్‌రోడ్డులోని వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియాన్ని సందర్శించారు. ఈ ఎయిర్‌క్రాఫ్ట్ విశేషాలను మ్యూజియం అధికారులు కమిటీ సభ్యులకు వివరించారు.

ఫిషింగ్ హార్బర్‌లో అధ్వానంగా రహదారులు

- గత ప్రభుత్వ హయాంలో నిర్వహణ లోపం
- మరమ్మతులపై దృష్టి సారించని అధికారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



పెద్ద పెద్ద గోతులతో నిండిన రహదారి

బీచ్ రోడ్డు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఫిషింగ్ హార్బర్ వద్ద రోడ్లన్నీ పాడయ్యాయి. గత ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించకపోగా నిర్వహణను సైతం గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వ యాంలో కూడా ఈ రోడ్లు మరమ్మతుకు నోచుకోవడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు మరింతగా పాడయ్యాయి. ఇప్పుడు చిన్న వర్షం వచ్చినా రోడ్లపై రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు కొందరు నిర్మాణదారులు రహదారికి అడ్డంగా ఇసుక, పిక్క, నిర్మాణ సామగ్రిని ఇష్టానుసారంగా పడేశారు. దీంతో వాహన చోదకులకు కష్టాలు మొదలయ్యాయి. మిగిలిన ఇరుకు రహదారిలో చీకటి వేళలో ప్రమాదకారంగా రాకపోకలు సాగించాల్సి రావడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రాళ్లు తేలిన ఈ రహదారిలో రాకపోకలు కష్టమే..

కళావిహీనంగా మహిళా ప్రాంగణం

- నిర్వహణ గాలికొదిలేయడంతో చిట్టడవిని తలపిస్తున్న ఆవరణ
- ఎటు చూసినా చెత్తాచెదారం.. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు
- పట్టించుకోని అధికారులు



ఆవరణలో పడి ఉన్న చెత్తకుప్పలు

ఆరిలోవ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారం నుంచి సింహాచలం వెళ్తున్న రోడ్డులో గల మహిళా ప్రాంగణంలో గల పార్కు చెత్తాచెదారంతో నిండిపోయింది.గతంలో ఈ పార్కులో వివిధ రకాల పూలమొక్కలతో ఆహ్లాదంగా ఉండేది. నిర్వ హణ గాలికి వదిలేయడంతో ప్రస్తు తం ఈ పార్కు కళావిహీనంగా త యారైంది. ఇక్కడ రోజూ వందలాది మంది మహిళలకు వివిధ శిక్షణా తరగతులను నిర్వహిస్తుంటారు. వివిధ ప్రాంతాలకు చెందిన వారు మహిళలు ఇక్కడకు వచ్చి శిక్షణ పొందుతుంటారు. అయితే ఈ చుట్టు పక్కలా ఎలాంటి ఆహ్లాదకర వాతావరణం కనిపించదు. ఎక్కడ చూసినా చెత్తాచెదారం, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు దర్శనం ఇస్తుం టాయి. దీంతో ఇక్కడకు శిక్షణకు వచ్చే వారు ఇబ్బంది పడుతుంటారు. ఈ ప్రాంగణంలో పాడైన వాహనాలు కూడా ఉంటాయి. ఆ వాతావరణం చూస్తే ఏదో చిట్టడవిలో ఉన్నట్టు అనిపిస్తుంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మహిళా ప్రాంగణంలో ఆహ్లాద వాతావరణం నెలకొనేలా చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.



తుప్పలమయంగా కనిపిస్తున్న పైనాపిల్ కాలనీలోని మహిళా ప్రాంగణం

గోస్తనీ వంతెన కింద అసాంఘిక కార్యకలాపాలు

తగరపువలస, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస గోస్తనీ నదిపై ఒకే ప్రాంతంలో పక్కపక్కన మూడు వంతెనలు ఉన్నాయి. వన్ వే పద్ధతిలో వీటిపై వాహనాలు నడుస్తుంటాయి. ఈ వంతెనల కింద పలు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వంతెనల పక్క నుంచి కాలిబాట మాదిరిగా రహదారి ఉండడంతో చాలా మంది బైక్‌లు, ఆటోల్లో ఇక్కడికి వచ్చి మద్యం సేవిస్తున్నారు. అలాగే కొందరు పేకాట ఆడుతున్నారు. కొన్ని ప్రేమ జంటలు కూడా కనిపిస్తున్నాయి. పోలీసులు తక్షణమే స్పందించి ఈ విషయమై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులతో అవస్థలు

తగరపువలస, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : భీమిలి నుంచి తగరపువలస వచ్చే రహదారిలో చాకలిపేట వద్ద ఉన్న బ్యాంకు రోడ్డులో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతు న్నాయి. ఈ రోడ్డు ఇరుగ్గా ఉండడంతో రెండు వాహనాలు తప్పుకోవడానికి అవకాశం ఉండడం లేదు. ఈ రహదారి నుంచి వాహనాలు జాతీయ రహదారి చేరుతుంటాయి. ఈ మార్గంలోనే మీసేవా కేంద్రం, శాఖాగ్రంథాలయం, అంగన్‌వాడీ, రైతు బజార్‌వంటి వాటితో పాటు ఎన్నో వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న ఈ రహదారి వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రైవేటు స్కూల్ బస్సులు ఈ రోడ్డు మీద నుంచే ప్రయాణిస్తుంటాయి. సంగివలస ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రికి కూడా ఈ రహదారే దగ్గర దారి. ఈ ప్రాంతంలో లారీలు ప్రయాణించే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ రోడ్డును వెడల్పు చేయడంతో పాటు ఇరువైపుల ఉన్న ఆక్రమణలను తొలగిస్తే కొంతవరకు సమస్య పరిష్కారమవుతోంది. ఆ దిశగా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల తొలగింపు చట్ట విరుద్ధం

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) :ఉక్కు కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు చట్ట విరుద్ధమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎన్.రామారావు అన్నారు. రిలే నిరాహార దీక్షల ప్రాంగణాన్ని ఉక్కు యాజమాన్యం కార్మికులు దీక్షలు చేయకుండా అక్కడ ఇనుప కంచెనుఏర్పాటు చేయటంతో రోడ్డు పైన శనివారం మండు టెండలో 1612వ రోజు రిలే నిరాహార దీక్షలు చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల తొలగింపు తక్షణమే ఆపాలనీ, శాశ్వత ఉపాధి కల్పించాలన్నారు.

రైతు బజార్ వద్ద నిత్యం అవస్థలే...

కంచరపాలెం,జూలై 12 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం రైతుబజార్ వద్ద తోపుడు బండ్లు, చిల్లర వర్తకులతో నిత్యం వాహనదారులు, పాదచారులకు అవస్థలు తప్పడం లేదు. అసలే ఇరుగ్గా ఉండే సర్వీస్ రోడ్డు దీంతో పాటు వాహనాల రద్దీతో నిత్యం రద్దీగా ఉంటుంది. తోపుడు బండ్లు, చిల్లర వర్తకులు రోడ్డును పూర్తిగా ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండడంతో సమస్య మరింత జటిలమమవుతోందని పాదచారులు వాపోతున్నారు. బజార్ ప్రధాన ద్వారానికి ఇరువైపులా చిల్లర దుకాణాలతో లోపలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. జీవీఎంసీ, ట్రాఫిక్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడంతో ఆక్రమణదారుల ఆగడాలు మితిమీరుతున్నాయి. ఈ మార్గంలో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారాంతాల్లో సమస్య మరీ దారుణంగా ఉంటోందని కొనుగోలుదారులు విమర్శిస్తున్నారు. అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

కేజీహెచ్‌లో అస్తవ్యస్తంగా పార్కింగ్

- ఇన్‌పేషెంట్ వార్డులున్న చోట వాహనాల పార్కింగ్
- స్థలాలు ఉన్నా.. క్రమబద్ధం చేయడంలో నిర్లక్ష్యం
- రోగులు, సహాయకులకు ఇబ్బందులు

మహారాణిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే రోగులు, వారి సహాయకుల రాకపోకలతో కేజీహెచ్ నిత్యం రద్దీగా ఉంటుంది. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వైద్యసహాయం కోసం వస్తుంటారు. ఇంత ఒత్తిడి ఉన్న ఈ పెద్దాసుపత్రిలో ప్రతి వ్యవస్థ పక్కాగా అమలు కావాలి. కాని ఎవరిష్టం వారిది అన్నట్లు కనిపిస్తోంది.నేడు ప్రతిఒక్కరూ సొంత వాహనాలు వినియోగిస్తున్నారు. దీంతో జన సంఖ్యకు దాదాపు సమానంగా వాహనాలు లోపల కనిపిస్తుంటాయి. వీటిని క్రమబద్ధం చేసే వ్యవస్థ పక్కాగా లేకపోవడంతో పార్కింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇన్‌పేషంట్ వార్డుల వద్ద, కొన్నిచోట్ల వార్డుల లోపల కూడా వాహనాలను


శస్త్రచికిత్స వార్డు లోపల పార్కింగ్ చేసిన వాహనాలు

పార్కింగ్ చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు! ఆసుపత్రిలో విధులు నిర్వహించే వైద్యులు, నర్సింగ్, ఇతర సిబ్బంది, వైద్య విద్యార్థులు, అధికారులు వారి వాహనాలతో ఆసుపత్రికి వస్తుంటారు. రోగుల సహాయకులు కొందరు, పరామర్శలకు వస్తున్నవారు సొంత వాహనాలతో ప్రవేశిస్తారు. సువిశాలమైన ప్రాంగణం ఉన్న కేజీహెచ్‌లో ఎక్కడికక్కడ వాహనాలను క్రమబద్ధం చేస్తే సమస్య ఉండేది కాదు. పర్యవేక్షణ లోపంతో రహదారికి ఇరువైపులా ద్విచక్ర వాహనాలు నిలపడంతో రోగులు నడవటానికి, అంబులెన్స్‌లు వెళ్లటానికి సైతం దారి లేకుండాపోతోంది. ఆసుపత్రిలో ప్రతీ ఒక్కరూ అసౌకర్యానికి గురవుతున్నారు. ఆసుపత్రి సిబ్బంది సైతం కనీసం ఆలోచన లేకుండా తమ వాహనాలను వార్డుల వద్ద, వార్డు లోపల కూడా పార్కింగ్ చేస్తున్నారు. రోగులు చికిత్స పొందుతున్న సమయంలో వారి వద్దకు వెళ్లడానికి చెప్పులు బయట విడిచివేయాలి. రోగులకు క్రిములు వారి దరిచేరకుండా పరిశుభ్రంగా ఉండాల్సిన వార్డుల వద్ద, నెల కూడా నిండని నవజాత శిశువుల వార్డు, చిన్న పిల్లల వార్డుల వద్దే పార్కింగ్ చేయటం దారుణం. అత్యంత పరిశుభ్రంగా ఉండాల్సిన చోటకూడా వాహనాలు పార్కింగ్ చేయడం గమనార్హం. ఆసుపత్రి గేట్ సమీపంలో, రాజేంద్ర ప్రసాద్ వార్డు, సీఎస్ఆర్ బిల్డింగ్, సూపర్ స్పెషాలిటీ, కార్డియాలజీ వార్డుల వద్ద పార్కింగ్ స్థలాలు ఉన్నా, వాహనాలను ఇష్టానుసారం నిలుపుతుంటారు. సుమారు 200 మంది ఉన్న ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం ఇక్కడ కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. కేజీహెచ్‌లో అడుగుపెట్టగానే అందరి కళ్లకు కనిపించేవి అసంఖ్యాకంగా ఉన్న వాహనాలే. ఆసుపత్రి పర్యవేక్షణాధికారుల 'దృష్టి'కి ఈ సమస్య రాకపోవడం విడ్డూరం.

రైల్వే స్టేషన్లలో వసతులు మెరుగుపడాలి

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



రైల్వే ప్రాజెక్టులపై సమీక్షిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చిత్రంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, సీఏఓ అంకుశ్ గుప్తా తదితరులు

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్లన్నీ వసతుల పరంగా మెరుగుపడాలని, ప్రయాణికుల సంతృప్తే ధ్యేయంగా పనిచేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు సూచించారు. డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో శనివారం ఆయన రైల్వే ప్రాజెక్టులు, పనులపై సమీక్షించారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి అంకుశ్ గుప్తాలు వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పెంచుతున్న మౌలిక సదుపాయాలను కేంద్ర మంత్రికి వివరించారు. విశాఖ రైల్వే స్టేషన్ రీ డెవలప్‌మెంట్, రోడ్ ఓవర్ బ్రిడ్జిల పనుల పురోగతి గురించి తెలిపారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ ఉండాలని సూచించారు. అమృత్ స్టేషన్లు, రైలు స్టాపులు, రైళ్ల పొడిగింపుల గురించి అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో డబుల్ లైన్, మూడు, నాలుగో లైన్ల పనుల గురించి ఆరా తీశారు. సమావేశంలో అసిస్టెంట్ డీఆర్ఎంలు మనోజ్ కుమార్ సాహూ, శాంతారామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణకు ఒప్పందం

సీతమ్మధార, జూలై 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ (అటానమస్) కళాశాల, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) మధ్య శనివారం కళాశాల ప్రాంగణంలో నైపుణ్య శిక్షణ ఒప్పందం జరిగింది. సీఐటీడీ ప్రిన్సిపల్ డైరెక్టర్ విజయ్ కృష్ణకాంత్ తమ సంస్థ ఈ కళాశాల ద్వారా పలు శిక్షణ కార్యక్రమాలు అందించేందుకు సముఖంగా ఉందని, ఇది అన్ని ఇంజనీరింగ్ విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధి, ఇండస్ట్రీ 4.0 అవసరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ మాట్లాడుతూ అధ్యాపకులు నూతన పరిజ్ఞానంతో సమకాలీనంగా ఉండటం అవసరమన్నారు. విద్యార్థులకు సీఐటీడీ ద్వారా లభించే పలు శిక్షణ కార్యక్రమాలకు కళాశాల


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న యాజమాన్య ప్రతినిధులు

ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు బుల్లయ్య ఇంజనీరింగ్ (అటానమస్) కళాశాలతో ఒప్పందం చేసుకుందని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దీపక్ చౌదరి, ఎంఎస్ఎంఈ కన్సల్టెంట్ కెఎన్ఎస్ ప్రకాష్, అధ్యాపకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వం

- సుపరిపాలన తొలిఅడుగులో టీడీపీ నేతలు

అక్కయ్యపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస నగర్‌లో శనివారం గ్రేటర్ 43వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం టీడీపీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డేటి శ్రీదేవి, సూర్యకుమారి, కన్నారావు, ఎస్‌జే నాయుడు తదితరులు పాల్గొన్నారు. 45వ వార్డు సింగాలమ్మపురంలోనూ నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం పాలనలో జరిగిన మంచిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ కార్యదర్శి వాసుపల్లి రాజు, నాయకులు పైలా ముత్యాలనాయుడు, అనసూరి


ప్రజలకు బ్రోచర్లు అందిస్తూ ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

మధుసూదనరావు, సుగుల లక్ష్మణరావు, పీలా నరేంద్ర, పలిశెట్టి అప్పన్న, గొలగాని సౌజన్య, సిమ్మారావు, సుగుల నూకరాజు, సదా జోగారావు పాల్గొన్నారు.

సర్కారు భూమికి స్కెచ్

(5వ పేజీ తరువాయి)

రెవెన్యూ సిబ్బంది వెళ్లి అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిలో ఎటువంటి ఆక్రమణలకు పాల్పడకూడదని స్పష్టంచేశారు. ఇప్పుడు అదే ప్రాంతంలో ఐదు ఎకరాలను ఒకరికి కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, కలెక్టర్ జోక్యం చేసుకుని అక్రమార్కుల కుట్రలను తిప్పికొట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

డిపట్టాలు రద్దు

రైవాడ కాలువ, పేద వర్గాలకు ఇళ్ల కోసం సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం గ్రామంలో సుమారు 20 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ప్రభుత్వ అవసరాలకు డీపట్టా భూములు వెనక్కి తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. రైవాడ కాలువ, ఇళ్ల కోసం అప్పట్లో కొన్ని డీపట్టా భూములు వెనక్కి తీసుకుని సదరు పట్టాలు రద్దు చేసింది.

జీవీఎంసీ ఆస్తులకు ఎసరు

(5వ పేజీ తరువాయి)

మార్పిడికి నాటి మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ ద్వారా ముందస్తు ఆమోదం తీసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ఈలోగా ఎన్నికలు వచ్చాయి. కూటమి అధికారంలోకి వచ్చింది. దాంతో కూటమిలో ప్రజా ప్రతినిధిగా ఉన్న ఒకరు ఆ బాధ్యతను తన భుజాన వేసుకున్నారు. అంతే...భూమార్పిడికి వీలుగా ఈ ఏడాది మే నెలలో మెమో అయ్యింది. అదేమాదిరిగా జీవీఎంసీ ఆరో వార్డు పరిధి మధురవాడ ఎంఎస్ఆర్ లేఅవుట్‌లోని బటర్‌ఫ్లై థీమ్ పార్కు వెనుక ఉన్న రెండు ఎకరాల భూమికి రోడ్డు సదుపాయం లేదు. పార్కులోని కొంతస్థలం ఇస్తే ఆ భూమికి రోడ్డు సదుపాయం ఏర్పడుతుంది. వైసీపీ హయాంలో ఇద్దరు రియల్టర్లు అప్పటి ప్రజా ప్రతినిధి ద్వారా పార్కుస్థలం మార్పిడికి ప్రయత్నించారు. సదరు ప్రజా ప్రతినిధి ద్వారా జీవీఎంసీలో పావులు కదిపారు. రాష్ట్రప్రభుత్వానికి ప్రతిపాదన చేరింది. నిర్ణయం తీసుకునేలోగా ఎన్నికలు వచ్చాయి. ప్రభుత్వం మారింది. దాంతో కూటమికి చెందిన నాయకుడిని ఆశ్రయించారు. పార్కు స్థలం మార్పిడికి సహకారం అందించాలని కోరారు. ఈ క్రమంలో ఒక మంత్రి పార్కుస్థలం మార్పిడికి వీలుగా చర్యలు తీసుకునేందుకు కమిటీని ఏర్పాటుచేయడం, ఆ కమిటీ అనుకూలంగా నివేదిక ఇవ్వడం...ప్రభుత్వం మెమో జారీచేయడం చకచకా జరిగిపోయాయి. అయితే బటర్‌ఫ్లై థీమ్ పార్కు స్థల మార్పిడిపై హైకోర్టులో పిల్ దాఖలు కావడంతో ధర్మాసనం స్టే విధించింది. కానీ, జీవీఎంసీ స్థలాలు అన్యాక్రాంతం కావడానికి నాయకులే కీలకంగా వ్యవహరించడం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

ఐదో వార్డులో పార్కుల ఆక్రమణపై హైకోర్టులో కేసు

(5వ పేజీ తరువాయి)

చేశారు. దీనిని కోర్టు విచారణకు స్వీకరించింది. ఈనెల 19న విచారణకు హాజరుకావాలని పిటిషనర్‌తోపాటు జీవీఎంసీ అధికారులను ఆదేశించింది. బొట్టవానిపాలెం, స్వతంత్ర నగర్ పార్కులను కొంతమంది ఆక్రమించుకుని, తప్పుడు పత్రాలతో విద్యుత్ కనెక్షన్ తీసుకుని పక్కా నిర్మాణాలకు సిద్ధం అవుతున్నారని, లచ్చిరాజు లేఅవుట్‌లోని పార్కులో నిర్మాణాలు చేపడుతున్నారంటూ ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టులో పిల్ దాఖలైన విషయం తెలియగానే జోన్-2 టౌన్ ప్లానింగ్ అధికారులు ఆగమేఘాల మీద వెళ్లి పార్కులో నిర్మించిన షెడ్‌ను తొలగించారు. ఇదిలావుండగా నగరంలో పార్కుల అన్యాక్రాంతంపై మేయర్ పీలా శ్రీనివాసరావు శుక్రవారం అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి పూర్తి వివరాలు సమర్పించాల్సిందిగా ఆదేశించారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

రంగస్థల నటులకు సింహాద్రి పురస్కారాలు

మురళీనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సాయి శ్రీనివాస కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రంగస్థల కళాకారులకు సింహాద్రి అవార్డులు అందజేశారు. గ్రేటర్ 50వ వార్డు మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాకారులకు పురస్కారాలు అందించారు. రైటర్స్ అకాడెమీ ఛైర్మన్ రమణమూర్తి, పోర్ట్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చౌదరి అప్పారావు, పలు సంస్థల నిర్వాహకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వైశాఖీ స్పోర్ట్సు పార్కు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమానికి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పార్కు కళావేదికలో భక్త చింతామణి సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. స్థానికులు, రంగస్థల నాటకాల అభిమానులు, పార్కు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాల రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్యలే!

కంచరపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం మెట్టు నుంచి ఆర్పీపేట పాఠశాలకు వెళ్లే మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఈ మార్గంలో తోపుడు బండ్లు,చిల్లర వర్తకులు రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు.అసలే ఇరువైన రోడ్డు కావడంతో రెండు వైపులా వచ్చే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు.సమీపంలో మూడు పాఠశాలల్లో సుమారు 1200 మంది విద్యార్థులు చదువుచున్నారు.ఉదయం,సాయంకాలం సమయాల్లో మరీ దారుణంగా ఉంటుంది. జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

విరిగిపడిన చెట్టు కొమ్మలు తప్పిన ప్రమాదం



సీతమ్మధార, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలో గల ఎస్ఎఫ్ఎస్ పాఠశాల వెనుక రోడ్డులో ఒక పెద్ద చెట్టు కొమ్మలు శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఆకస్మికంగా విరిగి పడ్డాయి. ఆ సమయంలో సమీపంలో ఉన్న వాహనాలు దెబ్బ తిన్నాయి తప్ప, రాత్రి పూట కావటంతో జనసంచారం లేక ప్రమాదం జరగలేదు. చెట్టు కొమ్మ మొదులో కుళ్లిపోవడంతో గాలి, వర్షం వచ్చినప్పుడు ఆకస్మికంగా పడిపోతున్నాయి. గతంలో కూడా నక్కవానిపాలెం ఏఎంజీ రోడ్డులో కొమ్మలు పడిపోవడంతో ఓ మహిళ మృతి చెందారు. అక్కయ్యపాలెం, బుల్లయ్య కళాశాల వద్ద కూడా ఇలాంటి సంఘటనలే చోటుచేసుకున్నాయి. కూలిపోయే స్థితిలో ఉన్న చెట్లను గుర్తించి వాటిని తొలగించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి : సీపీ బాగ్చి

డాబాగార్డెన్స్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. శనివారం సాయంత్రం డాబాగార్డెన్స్ పరిధిలోని సూర్యాబాగ్‌లోని పాప్‌హోమ్ 25వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీసు కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై హోమ్ వ్యవస్థాపకుడు కోడె దుర్గాప్రసాద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యంతో ముందుకు వెళ్తే ఉజ్వలమైన భవిష్యత్తు లభిస్తుందన్నారు. వ్యవస్థాపకుడు కోడె దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వివిధ కారణాలతో నిరాదరణకు గురైన బాలబాలికలను చేరదీసి బాగు చేస్తే చక్కగా జీవిస్తారన్నారు.డీఎస్పీ డాక్టర్ అజిత, సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ ఎంఆర్ఎల్ రాధ, డాక్టర్ అస్లాం ఆరిఫ్, రాజగోపాలరాజు


జ్యోతి వెలిగిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు సభాధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు, కోశాధికారి రమేష్‌చంద్, ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సమరశీల పోరాటాలు చేయాలి

- కారంచేడు ఉద్యమ సామాజిక కార్యకర్త భగత్‌సింగ్ పిలుపు

సీతంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మనువాద కార్పొరేట్ పాసిజానికి వ్యతిరేకంగా ప్రజా, దళిత, పౌర సంఘాలు సమరశీల పోరాటాలు చేయాలని కారంచేడు ఉద్యమ సామాజిక కార్యకర్త భగత్‌సింగ్ పిలుపునిచ్చారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కారంచేడు దళిత అమరవీరుల 40వ వర్ధంతి సభను శనివారం నిర్వహించారు. ముఖ్యవక్తగా విచ్చేసిన భగత్‌సింగ్ మాట్లాడుతూ కారంచేడులో జరిగిన నాటి భయానక హత్యోదంతాలను వివరించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుల పై కొండయ్య, సావిత్రిబాయి పూలే ట్రస్ట్ ఛైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి, న్యూడెమోక్రసీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో దళితులపై దాడులు పెరిగాయని తెలిపారు. ఈ కార్యక్ర



కారంచేడు మృతులకు నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ సంఘం ప్రతినిధులు

మంలో ఏరియా కమిటీ నాయకులు కె.నిర్మల, కె.చిన్నారావు, ఎం.లక్ష్మి, ఎస్‌వీ రమణ, జీడి సారయ్య, దేవా, సంఘాల నేతలు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. అరుణోదయ కళాకారులు కారంచేడు అమరులపై పాటలు పాడారు. కారంచేడు అమరవీరులకు నివాళులర్పించి, నినాదాలతో సంతాపం తెలిపారు.

కుటుంబ సభ్యులకు మానసిక రోగి అప్పగింత

అక్కయ్యపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న మానసిక రోగి బీనా అప్పమ్మ (49)ను ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన అప్పమ్మ భర్త ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కుమారుడు ఉన్నప్పటికీ తన సోదరి దగ్గర ఉండేదన్నారు. అయిదేళ్ల క్రితం ఆరోగ్యం పాడైందని, కుటుంబ సభ్యులు చికిత్స చేయించినా మందులు వాడకుండా ఇంటిలో నుంచి వెళ్లిపోయింది. అప్పటిలో వెతికి పట్టుకున్నా, ఈ ఏడాది జనవరిలో రెండోసారి వెళ్లిపోయింది. ఏయూటీడీ సిబ్బంది గుర్తించి చికిత్స చేయించడంతో కోలుకుంది. ఆమెను నరసన్నపేటలో ఉంటున్న సోదరి కొడుకు శ్రీనివాసరావుకు శ్రద్ధాప్రతినిధులు అప్పగించారని చెప్పారు.

'సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి విఫలం'

అక్కయ్యపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు విమర్శించారు. షాదీఖానా కల్యాణమండపంలో శనివారం 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి వార్డులో తెలియజేయాలని చెప్పారు. వైఎస్ జగన్మోహనరెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన మాటమీద నిలబడి చెప్పిన దానికన్నా మిన్నగా ప్రతి సంక్షేమ పథకం అమలు చేశారన్నారు. అనంతరం వైసీపీ నాయకులు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకుడు కదిరి


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

బాబూరావు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, డిప్యూటీ మేయర్ కె.సతీష్, బానాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, కార్పొరేటర్లు రెయ్యి వెంకట రమణ, అనిల్ కుమార్, పద్మారెడ్డి, ప్రసాద్, బర్కత్ అలీ, శశికళ పాల్గొన్నారు.

సమన్వయం లేని పనులు


ఇనుప గ్రిల్స్ తొలగించి వేసిన మంచినీటి బోరు

మాధవధార, జులై 12 (ఆంధ్రజ్యోతి): హైవేలో ఇప్పుడు హరిత ప్రాంత (గ్రీన్ బెల్ట్) స్థలాలన్నీ పనిగట్టుకుని నడక మార్గాలు (వాకింగ్ ట్రాక్)గా మార్చేస్తున్నారు. ఇక్కడ పచ్చదనం పెంచి వాహన కాలుష్యం నియంత్రించాలన్న ఆశయంతోనూ, భవిష్యత్ రోడ్డు విస్తరణ అవసరాలకు తగ్గట్టుగా ఏర్పాటైన గ్రీన్ బెల్ట్‌లకు అర్థమే మారిపోయింది. దీంతో పచ్చదనం హరించుకుపోతోంది. నడిచేవారు ఉన్నా, లేకపోయినా ట్రాకులు సిద్ధం చేయడం చకచకా జరిగిపోతోంది. ఓ వార్డులో మరో అడుగు ముందుకేసి ఎగిరే గుర్రాల బొమ్మలు, నందీశ్వరుల విగ్రహాలకు జీఈఎంసీ ఏకంగా రూ.80 లక్షలు కేటాయించింది. క్రికెట్ కోర్టు, ఆట స్థలాలుగానూ గీన్‌బెల్టులు మారిపోయాయి. విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోనే 54వవార్డు 104 ఏరియా జ్యోతినగర్ హైవే దగ్గర పెద్ద కళావేదికలా మార్చేశారు. మర్రిపాలెం రైతుబజారు దగ్గర కొత్తగా రకరకాల పేర్లు, సంఘాలతో నడక మార్గాలు (వాకింగ్ ట్రాక్స్) రిజిస్టర్ అయ్యాయి.

సమన్వయం కొరవడి; నగర వ్యాప్తంగా ఒకే రీతిగా కనిపించాలని ఇటీవల ఇనుప గ్రిల్స్ అమర్చారు. ఇప్పుడు వాటిని తొలగించి వాకింగ్ ట్రాక్స్‌లో బోర్లు వేస్తున్నారు. కొద్ది నెలల క్రితమే ఈ ఇనుప గ్రిల్స్ పనులు, ట్రాకుల నిర్మాణం ఒకేసారి జరిగినా, జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఏ పని తర్వాత ఏది చేయాలన్న స్పష్టత లేక పోయింది. భేషుగ్గా ఉన్న గ్రీన్ బెల్ట్ పాత ఇనుప ఫెన్సింగ్‌ని పీకేసి మరీ ఈ ఇనుప రెయిలింగ్ పనులు చేపట్టారు. కాంక్రీట్ దిమ్మెలు, ఇనుప రెయిలింగ్‌లు వేసి, తీరా ఇపుడు రెయిలింగ్ అడ్డం అని ఊడదీసి మంచినీటి బోర్లు వేస్తున్నారు. మొక్కల పెంపకాన్ని పర్యవేక్షించే ఉద్యానవనశాఖ, ఇంజనీరింగ్, నీటిసరఫరా నిర్వహణ పనుల్ని చూసే విభాగాల మధ్య సమన్వయ లోపంతో చేసిన పనులు మళ్లీ మొదటి నుంచి చేయడం లాంటి గందరగోళం తలెత్తుతోంది. తిరిగి ఇనుప రెయిలింగ్‌లను అక్కడ అమర్చకుండా తాళ్లతో కట్టి ఉండటాన్ని చిత్రంలో గమనించవచ్చు.

కొంగొత్తగా కైలాసగిరి

(5వ పేజీ తరువాయి)

నిర్మాణం ప్రతిపాదించారు.

ప్రముఖ పర్యాటక దేశమైన సింగపూర్‌లో సెంటోసా ఐల్యాండ్‌లో 'లూజ్ గ్రావిటీ రైడింగ్' ప్రత్యేకమైనది. చిన్న, పెద్ద తేడా లేకుండా ఇంటిల్లపాదీ ఎంజాయ్ చేసేలా ఉంటుంది. గోకార్టింగ్ తరహాలో ఉండే ఈ రైడ్ భూమి ఆకర్షణ శక్తితో పనిచేస్తుంది. దాని కోసం ప్రత్యేక ట్రాక్ కూడా ఉంటుంది. దీనిని కైలాసగిరిపై పెట్టనున్నారు.

మరింత పొడవుగా రోప్‌వే

ప్రస్తుతం కైలాసగిరికి వెళ్లడానికి అప్పుఘర్ వద్ద రోప్ వే ఉంది. చాలా చిన్న పెట్టెలతో నడుపుతున్నారు. ప్రయాణ దూరం కూడా తక్కువే. దీని స్థానంలో కొత్త తరహా రోప్ వే ప్లాన్ చేశారు. సుమారు 1.5 కి.మీ. దూరం అందులో ప్రయాణించేలా...ఆ సమయంలో సముద్రం అందాలు కనువిందు చేసేలా ఆ మార్గాన్ని తీర్చిదిద్దుతారు. అంతేకాకుండా ఈ ప్రాజెక్టు స్థలం వద్దే కార్లు పార్కింగ్ చేసుకునే సౌకర్యం కూడా కల్పించనున్నారు. ఈ రోప్‌వేను విస్తరించడం వల్ల ఆ చివరనున్న తెలుగు మ్యూజియానికి కూడా సందర్శకులు పెరుగుతారని అధికారులు భావిస్తున్నారు.

అన్నింటికీ ఆర్‌పీఎఫ్‌లు పిలిచాం

కైలాసగిరిని ప్రత్యేక ఆకర్షణగా మార్చాలనేది సీఎం చంద్రబాబునాయుడు ఆదేశం. ఆ మేరకు కమిషనర్ విశ్వనాథన్‌తో చర్చించి ఈ ప్రాజెక్టులు అన్నింటికీ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ ఆహ్వానించాం. వీటిని వీలైనంత త్వరగా నిర్మించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని యత్నిస్తున్నాం.

\- ప్రణవ్ గోపాల్, ఛైర్మన్, వీఎంఆర్‌డీఏ

అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ హాజరు

(5వ పేజీ తరువాయి)

731 మంది మెయిన్ టీచర్లు, మరో 35 మంది మినీ టీచర్లు, 692 మంది ఆయాలు పనిచేస్తున్నారు. ఆయా కేంద్రాల పరిధిలో గర్భిణులు 9,354 మంది, బాలింతలు 8,098 మంది, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 52,837 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 42,988 మంది ఉన్నారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు కూడా ఎఫ్ఆర్ఎస్ హాజరును వేస్తున్నారు. చిన్నారుల సంఖ్యకు అనుగుణంగా రేషన్‌ను పంపిణీ చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. దీనివల్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగే అవకతవకలకు అడ్డుకట్టే వేసేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

వీసీ వార్నింగ్

(5వ పేజీ తరువాయి)

సిబ్బంది లేరని ఆయనకు ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా లా, బీఈడీ కాలేజీలు దారుణంగా వ్యవహరిస్తున్న విషయాన్ని ఆయన గుర్తించారు. కొన్నాళ్ల కిందట ఒక బీఈడీ కాలేజీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన అక్కడ సిబ్బంది లేరని తెలుసుకుని తీవ్ర అసహనాన్ని వ్యక్తంచేశారు. ఆ తరువాత అనేక కాలేజీలకు సంబంధించి సమాచారాన్ని ఆయన తెప్పించుకున్నారు. కొన్ని కాలేజీలు విద్యార్థులు తరగతులకు రాకపోయినా డబ్బులు తీసుకుని పరీక్షలకు అనుమతిస్తున్నాయి. అదేవిధంగా పరీక్షల్లో కూడా మాస్ కాపీయింగ్‌కు ప్రోత్సహిస్తున్నాయి. దీంతో వర్సిటీ ప్రతిష్ట దెబ్బతింటోంది. ఇకపై అటువంటి వ్యవహారాలకు అడ్డుకట్ట వేయాలని వైస్ చాన్సలర్ నిర్ణయం తీసుకున్నారు.

అనుబంధ కాలేజీలపై పర్యవేక్షణ.?

ఏయూ అనుబంధంగా ఉన్న డిగ్రీ, పీజీ, బీఈడీ, న్యాయ కళాశాలలను నిరంతరం పర్యవేక్షించాలని ఇప్పటికే వీసీ ఆదేశాలు జారీచేశారు. కళాశాలల్లో తప్పనిసరిగా మౌలిక వసతులు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా భవనాలు, ఫ్యాకల్టీ ఉండాలని...లేనిపక్షంలో అనుమతులు ఇవ్వొద్దని స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చారు. లా, బీఈడీ కాలేజీల్లో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారాలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు చెబుతున్నారు. తీరు మార్చుకోని పక్షంలో తొలుత పరీక్ష కేంద్రంగా ఉన్న అవకాశాన్ని తప్పించనున్నారు. అప్పటికీ మార్పు రాకపోతే కాలేజీకి ఉన్న గుర్తింపును రద్దు చేయనున్నట్టు చెబుతున్నారు. వీసీ హెచ్చరికతో అడ్డగోలుగా నడుస్తున్న బీఈడీ, న్యాయ కాలేజీల యాజమాన్యాల్లో ఆందోళన మొదలైంది. అయితే వైస్ చాన్సలర్ హెచ్చరికలకే పరిమితం అవుతారా?, లేక అటువంటి కాలేజీలను గుర్తించి చర్యలకు దిగుతారా.?...అనేది చూడాల్సి ఉందని వర్సిటీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

ఉక్కుటౌన్‌షిప్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు శనివారం లేఖ రాశారు. ప్లాంటులో ఉపాధి కోసం నిర్వాసితులు చాలా ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్నారని, కానీ ఉపాధి మాత్రం లభించలేదని, ఈ క్రమంలో కాంట్రాక్టు పనులు చేస్తున్న నిర్వాసితులను కూడా విధుల నుంచి తొలగిస్తున్నారని పేర్కొన్నారు. ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు యాజమాన్యం పూనుకుందని, ఇటీవల కొంత మందిని తొలగించిందని, అదే విధంగా మరికొంత మందిని కూడా తొలగించేందుకు సిద్ధపడుతుందన్నారు. ఎన్నో ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను ఒక్కసారిగా విధుల నుంచి తప్పిస్తే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

నాబార్డ్ జాతీయ సమీక్షా సమావేశానికి

హాజరు కానున్న 'కోన'



గాజువాక, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి సంస్థ (నాబార్డ్) ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి మూడు రోజుల పాటు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నోలో జరగనున్న జాతీయ సమీక్షా సమావేశానికి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు హాజరు కానున్నారు. ఈ మేరకు శనివారం నాబార్డ్ నుంచి ఆహ్వానం అందింది. ఏపీలో రైతాంగంతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక యువకులు, మహిళల అభ్యున్నతికి, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే అంశం పై చర్చ జరగనుందని తెలిపారు. నాబార్డ్ ద్వారా మరిన్ని నిధులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

మోసపూరిత హామీలతో అధికారం

» గాజువాక వైసీపీ ఇన్‌చార్జి దేవన్‌రెడ్డి



మాట్లాడుతున్న దేవన్‌రెడ్డి

అగనంపూడి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబునాయుడు ప్రజలకు మోసపూరిత హామీల గుప్పించి గడిచిన ఎన్నికల్లో గద్దెనెక్కారని గాజువాక వైసీపీ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక సీడబ్ల్యూసీలో ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెలవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ, నేతలు బలిరెడ్డి నాగేశ్వరరావు, నక్కా రమణబాబు, కొలిపాక అప్పారావు, చినఅప్పారావు, బోర సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
● **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
● **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
● **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
● **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 30, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 36, బీరకాయలు 44, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 44, దొండకాయలు 38, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 62, అల్లం (పాతది) 46, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 34, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 84, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 80

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

నీటి సమస్యను పరిష్కరించాలి

» నీటి సరఫరా విభాగం అధికారులతో కార్పొరేటర్ జగన్



సిద్దార్థ నగర్‌లో వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంటును సందర్శించిన ఎస్‌ఈ కేవీఎన్ రవి, అధికారులు

కూర్మన్నపాలెం, జూలై 12(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు సిద్దార్థ నగర్‌లో ఉన్న 12 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటును శనివారం నీటి విభాగం ఎస్‌ఈ కేవీఎన్ రవి సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ సిద్దార్థ నగర్‌లో ఉన్న వాటర్ ట్రీట్‌మెంట్ 86, 87 వార్డులకు నీరు సరఫరా చేస్తుందని, ఎంవీవీఎంకెతో పాటు పలు బహుళ అంతస్తుల భవనాలు పెరిగిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడుతోందని, ఈ సమస్యను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన జీవీఎంసీ కౌన్సిల్‌లో ఈ సమస్యను ప్రస్తావించారని తెలిపారు.

నివాసితులు పెరగడం వల్ల తాగునీరు సరిపోకపోవడంతో 87వ వార్డులో మరో 12 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు అవసరమని తెలిపారు. దీనిపై అధికారులు మాట్లా డుతూ ఈ సమస్యను జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాగునీటి సరఫరా విభాగం అధికారులు ఈఈ శ్రీనివాస ప్రసాద్, డీఈఈ బీడీ శ్రీనివాస్, ఏఈ పి.కేదారినాథ్, టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌తో అతి తక్కువ ధరకే విద్యుత్

ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీకే నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ బీకే నాయుడు

గాజువాక/ ఆటోనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : సోలార్‌తో అతి తక్కువ ధరకే విద్యుత్ లభిస్తుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ బీకే నాయుడు అన్నారు. జీవీఎంసీ 72వ వార్డుతో పాటు శ్రీనగర్‌లో శనివారం సోలార్ రూఫ్ టాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా సోలార్ రూఫ్ నిర్మించుకుంటే విద్యుత్ ఆదా అవుతుందని, దీని ఏర్పాటుకు అతి తక్కువ వడ్డీకే బ్యాంకు రుణం లభిస్తుందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు కరెంటు బిల్లులను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు.ఈ సోలార్ రూఫ్ టాప్ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. వీటి ఏర్పాటునకు ప్రజలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఏజే స్టాలిన్, 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, ఎలక్ట్రికల్ ఏఈ చంద్రశేఖర్, స్థానిక నాయకులు పప్పు రాజారావు, జి.ఆనంద్, వీరయ్య, పరుశురాం పాల్గొన్నారు.

తెలుగు యువత 75వ వార్డు అధ్యక్షుడిగా సాయిమణికంఠ

» ప్రధాన కార్యదర్శిగా ములకలపల్లి



సాయిమణికంఠ



సీరందాసు కిశోర్

పెదగంట్యాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వవార్డు తెలుగుయువత అధ్యక్షుడిగా ఎం.సాయిమణికంఠ, ప్రధాన కార్యర్శిగా సీరందాసు కిశోర్ నియమితులయ్యారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ ఆదేశాల మేరకు వార్డు టీడీపీ అధ్యక్షుడు నమ్మి అప్పారావు, ప్రధాన కార్యదర్శి ములకలపల్లి పెంటయ్య ఈ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్రసాయిలో పార్టీని పటిష్ఠ పరిచేందుకు కృషి చేయాలని నియామక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



వీధి కుక్కలను పడుతున్న సిబ్బంది

అగనంపూడి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీలో వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల కాలనీల్లో వీధి కుక్కలు బెడద ఎక్కువ కావడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులపై కుక్కలు దాడి చేసి గాయపరుస్తుండడంతో ఈ విషయాన్ని స్థానికులు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో శనివారం వీధి కుక్కలను పట్టుకునేందుకు స్పెషల్ డ్రైవ్‌ను ఏర్పాటు చేశారు. వలతో కుక్కలను పట్టుకొని ఇక్కడ నుంచి తరలించారు.

భూ వివాదం : ఇరు వర్గాల ఘర్షణ

» పోలీసుల జోక్యం » పీఎల్‌సీఎఫ్‌కు నివేదించి, చర్యలు తీసుకుంటాం : సీఐ మల్లేశ్వరరావు

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : భూముల ధరలు కొండెక్కడంతో వివాదాలు అధికమవుతున్నాయి. ఎక్కడికక్కడ గొడవలు పడుతుండడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఎవరికి వారే ఆ భూమి తమది అంటూ భీష్మించుకుంటూ వాదనలు చేస్తున్నారు. దీనికి తోడు ఓ వర్గానికి పలుకుబడి గల పెద్దలు కొమ్ము కాస్తుండడంతో పోలీసులు పరిస్థితి ఇబ్బందికరంగా తయారవుతోంది. కూర్మన్నపాలెంలో శనివారం జరిగిన ఘటన ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది.

కూర్మన్నపాలెం జాతీయ రహదారికి సమీపంలో సుమారు 1.45 ఎకరాల భూమి మాది అంటే మాదంటూ ఇరు వర్గాల వారు పట్టుబడుతూ యుద్ధ వాతావరణాన్ని సృష్టించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి ఇరు వర్గాల వారిని పోలీస్ స్టేషన్‌కు రప్పించి తాత్కాలికంగా వివాదానికి చెక్ పెట్టారు. వివరాలిలా ఉన్నాయి.

కూర్మన్నపాలెంలో సర్వే నెంబరు 123/1లో సుమారు 1.06, 0.39 సెంట్లు గల 1.45 ఎకరాలను రెండు దఫాలుగా కడింశెట్టి అప్పలరాజు ఆయన సోదరులు రామారావు, గున్నయ్య శెట్టి 1981లో కొత్తపల్లి పరమేశ్ వద్ద కొనుగోలు చేశారు. ఆ భూమి అప్పటి నుంచి ఖాళీగానే ఉంది. కాగా ఆ భూమిని కడింశెట్టి అప్పలరాజు కుటుంబసభ్యులు డెవలప్‌మెంట్‌కు ఇచ్చారు. దీంతో వారు శనివారం ఆ స్థలాన్ని చదును చేస్తుండగా, ఆ భూమి తమది అంటూ భీమిలి సన్యాసయ్య కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. దీంతో కడింశెట్టి అప్పలరాజు కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో ఇరు వర్గాల వారిని తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లు పట్టుకొని రావాలని దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు సూచించారు. కాగా కడింశెట్టి అప్పలరాజు వర్గం శనివారం స్థలాన్ని శుభ్రం చేసి, ఫెన్సింగ్ వేస్తుండగా, మరో వర్గం వారు ఆ స్థలం వద్దకు వచ్చి, ఆ పనులను అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకొంది. అక్కడ యుద్ధ వాతావరణం నెలకొనడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరు వర్గాల వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ చేశారు. డాక్యుమెంట్లు పరిశీలించిన సీఐ స్థలానికి సంబంధించి గున్నయ్య శెట్టి లింకు డాక్యుమెంట్లు ఉన్నాయనీ, ఈసీ తీసుకు రావాలని కడింశెట్టి అప్పలరాజు సోదరులు గున్నయ్య శెట్టికి సూచించారు. ఆ స్థలంలో పనులను తాత్కాలికంగా నిలిపి వేయాలని ఆదేశించారు.

ఈ వివాదం పీఎల్‌సీఎఫ్‌కు నివేదించి వారి సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామనీ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

న్యూకాలనీ జంక్షన్‌లో వాహనాల చలానా డ్రైవ్



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సింధియా, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధి సింధియా న్యూకాలనీ జంక్షన్‌లో ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో శనివారం వాహనదారులకు హెల్మెట్ ధారణ, ట్రాఫిక్ చలానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలతో పాటు చలనాలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఎస్.ఐ. జి.అప్పారావు సిబ్బందితో కలిసి ట్రాఫిక్ చలానా డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు వాహనాలను నిలిపి వాటిపై ఈ చలానాలు ఉంటే పరిశీలించి జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్ నగర్ పార్కులో శ్రమదానం

కూర్మన్నపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 86వ వార్డు రాజీవ్ నగర్‌లో కాలనీ వాసులు పార్కులో శనివారం శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ కాలనీ పార్కుల్లోని వాకింగ్ ట్రాక్‌లలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించామన్నారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు వేగుంట శ్రీనివాస్, రమేష్, గణపతి, నాగార్జున,వేంకటేష్, కాలనీవాసులుపాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల తొలగింపు చట్ట విరుద్ధం

కూర్మన్నపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) :ఉక్కు కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు చట్ట విరుద్ధమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎన్.రామారావు అన్నారు. రిలే నిరాహార దీక్షల ప్రాంగణాన్ని ఉక్కు యాజమాన్యం కార్మికులు దీక్షలు చేయకుండా అక్కడ ఇనుప కంచెను ఏర్పాటు చేయటంతో రోడ్డు పైన శనివారం మండుటెండలో 1612వ రోజు రిలే నిరాహార దీక్షలు చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల తొలగింపు తక్షణమే ఆపాలనీ, ఉక్కు నిర్వాశితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని పలు డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కె.సత్యనారాయణ, వైటీ దాస్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించవద్దు : సీపీఎం



నిరసన ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

గాజువాక, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అదానీ స్మార్ట్ మీటర్లు బిగించవద్దని డిమాండ్ చేస్తూ శనివారం జీవీఎంసీ 76వ వార్డులో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీంతో విద్యుత్ బిల్లు భారం మరింత పెరుగుతుందన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వ వెంటనే విరమించుకోవాలన్నారు.

కూటమి పాలనతో ప్రజల్లో ఆనందం

రాష్ట్ర ప్రభుత్వ విప్ గణబాబు



58వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి పాలన ప్రజారంజకంగా ఉందంటూ ప్రజలు స్వాగతిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు), నియోజకవర్గ పరిశీలకులు రంగనాయకులు పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 58వ వార్డు శ్రీహరిపురం ప్రాంతంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం జరిగింది. నేతలకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. వైసీపీ పాలనలో ప్రజలు అడుగడుగునా అవమానాలు ఎదుర్కొన్నారని, ఇప్పుడు చాలా స్వేచ్ఛగా ఉన్నారని గణబాబు అన్నారు. ప్రతి హామీని నెరవేరుస్తామని తెలిపారు. వైసీపీ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని కోరారు. అచ్చినాయుడు తోట, ములగాడలో నిర్మించిన టిడ్కో ఇళ్లను త్వరలోనే కేటాయిస్తామని తెలిపారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో కూడిన బ్రోచర్లను ఎమ్మెల్యే గణబాబు స్థానికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి పొత్తబత్తుల శ్రీను, సీనియర్ నాయకులు వాతాడ రాంబాబు, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ 96వ వార్డు అధ్యక్షుడిగా పెంటకోట రాజేంద్రప్రసాద్



పెందుర్తి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి పరిధి 96వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా పెంటకోట రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో రాజేంద్రప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడీపీలో క్రియాశీలక కార్యకర్తగా గుర్తింపు పొందిన పాత పెందుర్తికి చెందిన రాజేంద్రప్రసాద్ ప్రస్తుతం పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. టీడీపీని పటిష్ఠ పరచి ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తానని ఆయన అన్నారు.

షిప్‌యార్డులో ప్రతి సమస్యను పరిష్కరిస్తా

ఉద్యోగ సంఘ ప్రతినిధులకు ఎంపీ హామీ



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

మల్కాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): షిప్‌యార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీఎన్‌టీయూసీ ప్రతినిధులు విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను శనివారం ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎల్అండ్ఎం సీరిస్, వర్క్ మేన్ టు స్టాఫ్, స్టాఫ్ టు ఆఫీసర్స్, లీవ్ ఎన్‌కేష్‌మెంట్, ఎండీ సొసైటీ కార్మికుల సమస్యలకు పరిష్కార మార్గం దొరకడం లేదని తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్మూర్తి, షిప్‌యార్డు టీఎన్‌టీయూసీ యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ రాము, గౌరవ అధ్యక్షుడు రమణ, కోశాధికారి మహేష్, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు బోసు, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

తరుణి పార్కులో శ్రమదానం



యంత్రంతో పార్కును శుభ్రం చేయిస్తున్న దృశ్యం

మల్కాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 60వ వార్డు ఉడా కాలనీలో ఉన్న తరుణి పార్కులో ప్రతినిధులు శనివారం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ పీవీ సురేష్ ఆధ్వర్యంలో కాలనీ కమిటికీ నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బంగారు రాజు, ప్రతినిధులు విజయ్, రాజేష్, సతీష్, బొమ్మిడి శ్రీను, ఎంజీజీ శ్రీను, సంతోష్ తదితరులు ఈ శ్రమదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

నత్తనడకన క్రీడా మైదాన అభివృద్ధి పనులు



జెడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో నిలిచిన అభివృద్ధి పనులు

గోపాలపట్నం, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ క్రీడామైదానంలో సుమారు రూ.1.30 కోట్లతో చేపడుతున్న ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. జెడ్పీ హైస్కూల్‌కు ఆనుకుని సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో క్రీడామైదానం ఉంది. ఇందులో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కూడా నిర్మించారు. మైదానం విశాలంగా ఉన్నప్పటికీ చదును లేకపోవడంతో మైదానంలో క్రీడల నిర్వహణకు అనువుగా లేదు. దీంతో పాటు మైదానంలో నీటి ఊటల కారణంగా ఏడాదిలో సుమారు సగం రోజులు చిత్తడిగా మారుతుంది. ఈ క్రమంలో క్రీడామైదానం ఆధునికీకరణకు సుమారు రూ.1.30 కోట్లతో ఇటీవల అభివృద్ధి పనులు ప్రారంభించారు. కొద్ది రోజుల పాటు పనులు చురుగ్గా జరిగినా, ఇటీవల పనులు నిలిచిపోయాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో క్రీడామైదానంలో పనులకు మరింత ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. క్రీడామైదానం ఆధునికీకరణ కోసం ఉపయోగించే గ్రావెల్ వర్షాల కారణంగా లభించడం లేదని, ఇందువల్లే పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు. ఆధునికీకరణ పూర్తయితే పాఠశాల విద్యార్థులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది ఔత్సాహికులకు ఈ మైదానం ఆసరాగా నిలుస్తుంది.

నేడు శ్రవణనక్షత్ర వేడుకలు



ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరుడు

వేపగుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవినగర్ శేషాద్రిపై కొలువైన కల్యాణ వేంకటేశ్వరాలయంలో ఆదివారం స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్ర వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు శ్రీనివాసస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, అర్చనలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం సామూహిక విష్ణు సహస్ర నామపారాయణం, భక్తి గీతాలాపన నిర్వహించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

'జోసెఫ్ మృతి టీడీపీకి తీరని లోటు'



నివాళులు అర్పిస్తున్న నేతలు

కూర్మన్నపాలెం,జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87 వార్డు సిద్దార్థ నగర్‌కు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు జోసెఫ్ అకాల మరణం పార్టీకి తీరని లోటు అని తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి, వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. ఈ సందర్భంగా జోసెఫ్ మృతదేహంపై టీడీపీ జెండా కప్పి నివాళులు అర్పించారు. దహన సంస్కారాల్లో పాల్గొన్నారు. ఈ అంత్యక్రియల్లో జోసెఫ్ కుమారుడు పాల్, ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, బలిరెడ్డి నాగేశ్వరరావు, రమేష్, సునీల్ అధిక సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజల ఆందోళన

మల్కాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ములగాడ గ్రామంలో వారం రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. మండుటెండలకు తోడు విద్యుత్ లేకపోవడంతో ప్రజలు అసహనంతో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడానికి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టారు. రోజులో ఎప్పుడు విద్యుత్ ఉంటుందో..ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ములగాడలో నెలకొంది. ఉక్కపోతతో సతమతమవుతున్నారు. మూడురోజులుగా ఎండలు మండిపోతున్న సమయంలో శ్రీహరిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులు కోతలు విధించడం దారుణమని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ములగాడ ప్రజలు కోరుతున్నారు.

మిత్రుడి జ్ఞాపకార్థం రక్తదానం



రక్తదానం చేస్తున్న మిత్రులు

మల్కాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తమ స్నేహితుడి మాదిరిగా రక్తం అందక ఎవరూ చనిపోకూడదనే దృక్పథంతో శ్రీహరిపురంలో కొంతమంది మిత్రులు విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సెంటర్ (విమ్స్) సహకారంతో ఎన్‌వీఆర్ ఫ్రెండ్స్ పేరిట శనివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ దుర్గాప్రశాంతి (జనసేన) ప్రారంభించి మాట్లాడారు. 2014లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి సమయానికి రక్తం అందక చనిపోయిన మిత్రుడి జ్ఞాపకార్థం పదేళ్లగా క్రమం తప్పకుండా రక్తదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఎన్‌వీఆర్ ఫ్రెండ్స్ రక్తదానం చేశారు.

'మా పిల్లలు మా బడిలోనే'



బుచ్చిరాజుపాలెం ప్రభుత్వ పాఠశాలలో తన కుమార్తెను చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు జగన్

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఆదర్శంగా నిలిచారు. ఇక్కడి పాఠశాలలో పాఠాలు చెబుతున్న పెదవాల్తేరుకు చెందిన ఇంగ్లీష్ టీచర్ జగన్ తన కుమార్తె దేవాన్షి ప్రియను రెండో తరగతిలోనూ, సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న నాయుడుతోటకు చెందిన దుర్గాభవాని తన కొడుకు చంద్రశేఖర్‌ను 6వ తరగతిలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు దీటుగా ఉన్నాయని నిరూపించేందుకు వారు తీసుకున్న నిర్ణయాన్ని సహచర ఉపాధ్యాయులు అభినందించారు. కొత్తగా చేరిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ ప్రవేశాలు కల్పించారు.

అప్పన్న సన్నిధిలో ప్రభుత్వ రంగ సంస్థల లెజిస్లేచర్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్



రవికుమార్‌కు స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న ఆలయ అధికారులు

సింహాచలం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని ప్రభుత్వ రంగ సంస్థల లెజిస్లేచర్ కమిటీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ ఆలయ మార్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న చైర్మన్ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఆలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు శాలువతో సత్కరించి స్వామివారి ఫొటో, ప్రసాదాలను అందజేశారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు



ఆలయంలో భక్తుల రద్దీ

సింహాచలం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వేలాది మంది భక్తులు శనివారం తరలివచ్చారు. ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాలకు చెందిన వారు సూర్యోదయానికి ముందే సింహాచలం చేరుకుని, పుష్కరిణిలో స్నానాలు ఆచరించి, సమీపంలో ఉన్న భైరవస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి కొందరు కాలినడకన, మరికొందరు బస్సుల్లో సింహగిరికి చేరుకున్నారు. తలనీలాలు సమర్పించి, గంగధారలో స్నానాలు ఆచరించి, అప్పన్నను దర్శించుకున్నారు. భక్తుల రద్దీ వల్ల స్వామివారి ఖజానాకు సుమారు రూ. 51 లక్షల ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు.

అశోక్‌గజపతిరాజుకు పండితుల ఆశీర్వచనాలు



అశోక్‌గజపతిరాజును ఆశీర్వదిస్తున్న అర్చకులు

సింహాచలం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి ప్రదక్షిణ విజయవంతం కావడంతో సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజుకు ఈఓ వేంద్ర త్రినాథరావు కృతజతలు తెలిపారు. శనివారం ఆలయ అధికారులు విజయనగరంలోని అశోక్‌గజపతిరాజు నివాసానికి వెళ్లి కలిశారు. ఆలయ వేద పండితుడు గోదావరి సురేశ్ ఘనాపాటి, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు అశోక్‌కు ఆశీర్వచనాలను అందజేయగా, ఈఓ శాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు, ఈ కార్యక్రమంలో దేవస్థానం డీఈఈ రామరాజు (హరి), తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఏఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): భారత్ క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్, మహతీ డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఏఐ, డేటాఫర్ క్లైమేట్ నాలుగో ఏడాది బ్యాచిలర్స్ డిగ్రీని ఏయూ సౌజన్యంతో ఉచితంగా అందజేయనున్నట్లు సీనియర్ పార్టనర్ క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ లీడ్ ప్రతినిధి జాయి జోషి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో భాగంగా ఏఐ, క్లైమేట్ మార్పులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన పెంచటం, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లో శిక్షణ ఇవ్వ టం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేసి డేటా అనాల్టిక్, ఏఐల్లో నైపుణ్యత గల విద్యార్థులను తయారు చేసేందుకు ఈ కోర్సులు డిజైన్ చేశామన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న విద్యార్థులకు శిక్షణ ఉచితమని, పరిమితంగా సీట్లు ఉంటాయన్నారు. వివరాలకు ఎన్.ఎ.డి.జంక్షన్‌లో మహతీ డిగ్రీ కళాశాల లేదా ఆన్‌లైన్ అప్లికేషన్లకు 9848742069, 7032045050 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛ భారత్ సాధనలో మొదటి స్థానమే లక్ష్యం

» స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



డంపింగ్ యార్డు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పట్టాభిరామ్, కమిషనర్ కేతన్ గార్గ్, తదితరులు

కొమ్మాది,జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ సాధనలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి కాపులుప్పాడ డంపింగ్ యార్డు, జిందాల్ పవర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని తలపెట్టిన స్వచ్ఛభారత్ అభియాన్‌కు సీఎం చంద్రబాబునాయుడు బ్రాండ్ అంబాసిడర్‌గా మారిపోయారని, నెలలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సంబంధించి ఇప్పటికే పలు నగరాలు అవార్డులు సాధించాయని, ముఖ్యంగా విశాఖకు స్పెషల్ మినిస్టీరియల్ అవార్డు దక్కడం సంతోషకరమన్నారు. జీవీఎంసీకి వచ్చే రెండు నెలల్లో చెత్త తరలింపునకు 95 ఎలక్ట్రికల్ వాహనాలు అందించనున్నట్టు తెలిపారు. కాపులుప్పాడ డంపింగ్ యార్డులో పచ్చదనం పెంపొందించి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కమిషనర్‌కు సూచించారు. రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ జీవీఎంసీకి ఏడాదిలో రెండు అవార్డులు రావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఇప్పటికే 70 నుంచి 80 శాతం చెత్తను క్లియర్ చేశామని, ప్రతిరోజూ డోర్ టు డోర్ చెత్తను 90 శాతం వరకు సేకరిస్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జోన్ -2 కమిషనర్ కనకమహాలక్ష్మి, జీవీఎంసీ అధికారులు నరేశ్‌కుమార్, కిశోర్, గోవిందరావు, జిందాల్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలి

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



కార్యక్రమంలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చి, బ్రాండిక్స్' దొరస్వామి, తదితరులు

సీతంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హితవు పలికారు. శనివారం అంబేడ్కర్ భవన్‌లోని 'ఆల్కహాలిక్స్ ఎనానిమస్ వాల్తేర్ ఇంటర్ గ్రూప్-విశాఖపట్నం' ఆధ్వర్యంలో చెడు మార్గాలవైపు యువత పయనించవద్దు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ దురలవాట్లకు లోనైనవారు సమాజంలో గౌరవాన్ని, కుటుంబంలో స్థానాన్ని కోల్పోతారన్నారు. మంచి మార్గంలో పయనించాలన్నారు. ప్రతీ ఒక్కరూ ఉన్నతంగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బ్రాండిక్స్ ఇండియా భాగస్వామి దొరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా స్వాతి షాపింగ్ మాల్ ప్రారంభం



అగ్గిపెట్టెలో పట్టే చీరను చూస్తున్న సినీ నటి శ్రీలీల

నగరంలో సినీ నటి శ్రీలీల సందడి

మహారాణిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఐదు తరాల చరిత్ర గల స్వాతి షాపింగ్ మాల్‌ను విశాఖలోని జగదాంబ జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ షాపింగ్ మాల్‌ను శనివారం అగ్ర సినీ తార శ్రీలీల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా తెలుగు ప్రజల అభిరుచులకు అనుగుణంగా దుస్తులు అందిస్తున్న నమ్మకమైనది స్వాతి షాపింగ్ మాల్ అని పేర్కొన్నారు. అత్యాధునికమైన నాలుగు అంతస్తులలో ఏర్పాటు చేసిన సంప్రదాయ విలువ లతో కూడిన ఫ్యాషన్ ప్రపంచమని పేర్కొన్నారు. ఇక్కడ ప్రతీ వస్త్రం ఒక కథ చెబు తుందని, ప్రతీ ఫ్యాబ్రిక్ ఒక కళాఖండంలా మెరుస్తుందని, స్వాతి సంపూర్ణ కుటుంబ షాపింగ్ మాల్ అని కొనియాడారు. షాప్ అంతటినీ కలియతిరిగిన శ్రీలీల అగ్గిపెట్టెలో ఒదిగిపోయే నాజూకు పట్టుచీరను, పరిమళాలు వెదజల్లేవి, రంగులు మారే పట్టుచీర లను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఆమెను చూసేందుకు షాపింగ్ మాల్ వద్దకు వచ్చిన అభిమానులతో శ్రీలీల కొద్దిసేపు మాట్లాడి, రెండు స్టెప్‌లు వేసి ఆహ్లాదపరిచారు. ఈ కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో అవినీతిపై చర్చకు బొత్స సిద్ధమా?

» ప్రభుత్వ రంగ సంస్థల లెజిస్లేచర్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఏడాది కూటమి పాలనపై వైసీపీ నేత బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వ రంగ సంస్థల లెజిస్లేచర్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ ఖండించారు. మతిభ్రమించి బొత్స మాట్లాడుతున్నారని ఆరోపించారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ రంగ సంస్థలను సమీక్షించిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడినపుడు బొత్స చేసిన వ్యాఖ్యలను పలువురు ప్రస్తావించినపుడు ఘాటుగా స్పందించారు. జగన్ హయాంలో మద్యం, విద్యాశాఖలో అవినీతి జరిగిందని, ఈ రెండు శాఖల్లో జరిగిన అవినీతిపై చర్చకు బొత్స సిద్ధమేనా అంటూ సవాల్ చేశారు. మతిభ్రమించిన బొత్స మెంటల్ ఆస్పత్రిలో ఉండాలని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో అభివృద్ధి పేరిట నాడు-నేడు పథకం కోసం సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చి రూ.కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి అన్ని ఆధారాలతో నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, తన సవాల్‌ను బొత్స స్వీకరిస్తారా? అని ప్రశ్నించారు. మద్యం విధానంలో స్కామ్ జరిగిందని సీనియర్ ఐఏఎస్ అధికారి రజిత్‌భార్గవ్ చెప్పింది నిజం కాదా అని రవికుమార్ పేర్కొన్నారు.

వ్యభిచారం కేసులో ఆరుగురి అరెస్టు

కూర్మన్నపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కూర్మన్నపాలెంలోని నేహా విలాస్ భవన్‌లో శుక్రవారం రాత్రి దువ్వాడ పోలీసులు దాడి చేసి వ్యభిచారం నిర్వహిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూర్మన్నపాలెంలో జాతీయ రహదారికి ఆనుకుని నేహా విలాస్ భవన్‌లో వ్యభిచారం జరుగుతున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. మూడు గదుల్లో వ్యభిచార కార్యకలాపాలు జరుగుతున్నట్టు గుర్తించారు. నర్సీపట్నానికి చెందిన దేవరపు దుర్గాప్రసాద్ అనే వ్యక్తి ఓ మహిళను ఇక్కడకు తెచ్చాడని సీఐ తెలిపారు. మూడు రూములు తీసుకుని, వీటిలో ఓ గదిలో మహిళను, మరో రెండు రూముల్లో విటులు అరవింద్, పైడిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, పెంటయ్యలను ఉంచి వ్యాపారం సాగిస్తుండగా పట్టుకున్నామన్నారు. విటులతో పాటు నిర్వాహకుడు దుర్గాప్రసాద్, రిసెప్షనిస్టు పూర్ణచంద్ర బిసాయ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. మహిళను హోమ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్టు

ఎండాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు యువకులను అరెస్టు చేసి, చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు క్రైమ్ విభాగం ఏసీపీ డి. లక్ష్మణరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. ఆరిలోవలోని దుర్గాబజార్‌లో మీసాల ఉష నివాసం ఉంటుంది. ఆమె భర్త చంద్రశేఖర్ బెంగళూరులో కంప్యూటర్ గ్రాఫిక్స్ విభాగంలో పని చేస్తున్నారు. గత నెల 13న సెలవు మీద విశాఖ వచ్చారు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పలుచోట్ల షాపింగ్ చేసి, అదే రోజు ఐటీ రోడ్డులో ఉన్న మరిడిమాంబ ఆలయానికి స్కూటీపై వెళ్తుండగా గీతం ఆసుపత్రి వద్ద బైక్‌పై వెనుక నుంచి వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలో ఉన్న 32 గ్రాముల బంగారు గొలుసును అపహరించుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు స్నాచర్స్ అంతర్రాష్ట్ర ముఠాయిలుగా నిర్ధారించుకుని నిఘా పెట్టారు. వారు వినియోగించిన బైక్ ఢిల్లీకి చెందినదిగా గుర్తించారు. ఈమేరకు శనివారం ఎండాడ - రుషికొండ రోడ్డులో బైక్‌ను గుర్తించి, ఢిల్లీకి చెందిన దీపక్‌కుమార్ సింగ్, కుమోద్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.



పోటీలు ప్రారంభిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఆయన సతీమణి జ్యోత్స్న బొహ్రా

బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎం కప్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలురు, బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ శనివారం ప్రారంభమైంది. రైల్వే ఇండోర్ బాక్సింగ్ హాల్లో జరుగుతున్న ఈ పోటీలకు డీఆర్ఎం లలిత్ బొహ్రా, వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ బాక్సింగ్ క్రీడకు విశాఖలో విశేష ఆదరణ ఉందని, అన్ని క్రీడల అభివృద్ధికి వాల్తేరు రైల్వే తమ వంతు ప్రోత్సాహాన్ని, సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కేటగిరీలలో సుమారు 150 మంది బాక్సర్లు ప్రాతినిధ్యం వహించి ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్పోర్ట్సు ఆఫీసర్ హరినాథ్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఉష, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, ఒలింపిక్ సంఘం ప్రతినిధులు కె.సూర్యనారాయణ, మోహన్ వెంకటరామ్, బాక్సింగ్ సంఘం ప్రతినిధులు లక్ష్మణ్‌దేవ్, రామకృష్ణారెడ్డి, శివప్రసాద్, రైల్వే బాక్సింగ్ కార్యదర్శి మురళి, రైల్వే స్పోర్ట్సు మాజీ కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు, రైల్వే బాక్సర్ కనకదుర్గ పాల్గొన్నారు.

ప్రతి ఆస్పత్రి నుంచి ఐదుగురు మార్గదర్శులు ఉండాలి

» డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జగదీశ్వరరావు

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఆస్పత్రి నుంచి కనీసం ఐదుగురు మార్గదర్శులు ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. నగర పరిధిలోని బిల్ జంక్షన్ సమావేశ మందిరంలో ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఆంధ్ర మెడికల్ కళాశాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్, నవరతన్ చారిటబుల్ ట్రస్టు (వరుణ్ గ్రూప్), శంకర్ ఫౌండేషన్, తదితర సం స్థలతో శనివారం ఆయన సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4)కు సంబంధించి బంగారు కుటుంబం, మార్గదర్శి అనే అంశాల గురించి వివరించారు. ప్రతి ఆస్పత్రి నుంచి నలుగురు మార్గదర్శులు ఉండేలా ఆస్పత్రులు చర్యలు చేపట్టడంతో పాటు సంబంధిత జాబితాలను జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ తప్పని సరిగా పీ4కు సంబంధించిన మార్గదర్శులను గుర్తించి పంపిస్తామన్నారు. డాక్టర్ జె.సరోజిని మాట్లాడుతూ తమ అసోసియేషన్ ద్వారా పీ4కు సహకారాన్ని అందిస్తామన్నారు. ఎన్‌టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ మార్గదర్శుల వివరాలను త్వరలో జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయానికి అందించాలని, వీటిద్వారా బంగారు కుటుంబాలకు సేవలందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులు డాక్టర్ దవళ భాస్కరరావు, డాక్టర్ కల్యాణ్‌ప్రసాద్, డాక్టర్ వినీత్, తదితరులు పాల్గొన్నారు.